రేపు రైతు సంఘం బృందం పర్యటన

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీ రైతు సంఘం బృందం శనివారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అధిక వర్షాలు, గిట్టుబాటు ధరలు లేక నష్టపోయిన ఉల్లి, పత్తి, టమోటా పంటలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో గ్రామాలను తిరిగి పంటలను పరిశీలించి, పెట్టుబడి ఏ పంటలకు ఎంత అవుతుందో.. లెక్కలు వేయడానికి నాయకులు వస్తున్నారని వివరించారు


ఉల్లి రైతులు ధరాఘాతంతో అప్పుల ఊబిలో కూరుకుపోయారు. కూలీ ఖర్చులు కూడా గిట్టుబాటు కాక తీవ్ర వేదనలో ఉన్నారు. కదిపితే కన్నీటి సుడులే. ఇలాంటి సమయంలో మేమున్నామని భరోసా ఇచ్చి అండగా నిలవాల్సిన వారే రైతులను నట్టేట ముంచుతున్నారు. మార్కెట్‌కు వచ్చిన రైతులు అడుగడుగునా దోపిడీకి గురవుతున్నారు. హమాలీ పేరిట ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లికి హమాలీ ఖర్చులు తామే చెల్లిస్తున్నామని ఆ సంస్థ అధికారులు చెబుతున్నారు. బస్తాలకు కట్టే తాడుతో సహా హమాలీ ఖర్చులు పేరిట ముక్కుపిండి వసూలు చేస్తున్నారని రైతులు ఏకరువు పెడుతున్నారు. ఏపీ మార్క్‌ఫెడ్‌కు ఉల్లి అమ్మిన రైతులను విచారిస్తే హమాలీ పేరిట జరుగుతున్న దోపిడీ పర్వం వెలుగు చూస్తుంది. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోకుండా రైతులనే అధికారులు తప్పు పట్టడం విమర్శలకు తావిస్తోంది. కర్నూలు మార్కెట్‌లో వివిధ రూపాల్లో దోపిడీకి గురవుతున్న కష్టజీవుల కన్నీటి వేదనపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



నిండా ముంచేశారు..!

- కర్నూలు మార్కెట్‌లో నిబంధనలు బేఖాతరు
- హమాలీ పేరిట దగా చేస్తున్నారు
- హమాలీ ఖర్చులు భరిస్తున్న మార్క్‌ఫెడ్
- అయినా రైతుల నుంచి బలవంతపు వసూళ్లు
- బస్తాకు రూ.45 వరకు దోపిడీ
- చోద్యం చూస్తున్న మార్కెట్ యంత్రాంగం





కర్నూలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో ఏకైక ఉల్లి మార్కెట్ కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు. సీమ జిల్లాలతో పాటుగా సరిహద్దు తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా, కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాల నుంచి ఉల్లి దిగుబడులతో పాటు వేరుశనగ, వాము, ఆముదం.. వంటి పంట దిగుబడులు అమ్మకానికి తెస్తున్నారు. రైతులు తీసుకొచ్చే వివిధ పంట దిగుబడులు ప్లాట్‌ఫాంలో దింపడం, కోత కోసి కుప్పపోయడం, ఆ తరువాత కాటా.. ఇలా హమాలీలు చేసే ఒక్కో పనికి ఒక్కోరేటు నిర్ణయించారు. అందులో మూడు రకాల హమాలీ ఖర్చులు రైతులు భరించాల్సి ఉంటుంది. పంట విక్రయం (ట్రేడింగ్) జరిగిన తరువాత కాటా, లోడింగ్ వంటి హమాలీ ఖర్చులు కొనుగోలుదారులే భరించాలి. అదికూడా మార్కెట్ కమిటీ నిర్ణయించిన ధర కంటే ఒక్కపైసా కూడా అదనంగా తీసుకోకూడదు. నిబంధనలు తుంగలో తొక్కేసి మార్కెట్‌కు వచ్చే రైతుల కన్నీటిని సైతం దోచేస్తున్నారంటే దోపిడీ పర్వం ఏస్థాయిలో జరుగుతుందో తెలుసుకోవచ్చు. క్షేత్రస్థాయిలో నిఘా ఉంచి అడ్డుకోవాల్సిన మార్కెట్ యార్డు సూపర్‌వైజర్లు, ఆపై అధికారుల పర్యవేక్షణ లోపంతో దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

చితికిన రైతులపై అదనపు భారం

ఎకరం ఉల్లి సాగుకు రూ.లక్షకు పైగా పెట్టుబడి వస్తుంది. నాలుగు నెలలు కష్టపడితే ఎకరాకు 50 బస్తాలు కూడా దిగుబడి రాని పరిస్థితి. మట్టిమనుషులు లాభపడాలంటే క్వింటా కనీసం రూ.3 వేలు ధర ఉండాలి. అప్పుడే పెట్టుబడి పోనూ ఎకరాకు రూ.35-50 వేలు రైతుకు లాభదాయంగా ఉంటుంది. ఈ ఏడాది ఉల్లి ధరలు పూర్తిగా పతనమయ్యాయి. క్వింటా రూ.350-500లకు కూడా పలకని పరిస్థితి ఉంది. దీనికి తోడు అధిక వర్షాలకు పంట దెబ్బతిని దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. పంటకోత కూలీలు, రవాణా ఖర్చులు కూడా చేతి నుంచే పెట్టుకోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో రైతులు ఉల్లి పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. ఇలాంటి సమయంలో అండగా మేమున్నామని సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం క్వింటాకు రూ.1,200 మద్దతు ధర ప్రకటించింది. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ నిర్ణయం చితికిపోతున్న రైతుల్లో ఊపిరి పోసింది. కొంతైనా చేతికొస్తుందనే ఆశతో ఉల్లి పంటకోసి, గ్రేడింగ్ చేసి కర్నూలు మార్కెట్‌కు తెస్తున్నారు. నిబంధనలు ప్రకారం రైతులు తీసుకొచ్చిన ఉల్లి బస్తాకు అన్ లోడింగ్ (దింపడం) రూ.5.04, కోసి కుప్ప పోయడానికి రూ.5.04, చాటా నింపుటకు రూ.5.04 కలిపి బస్తాకు రూ.15.12 రైతులు చెల్లించాలి. ఆ తరువాత ఖర్చులన్నీ కూడా కొనుగోలుదారులు (ట్రేడర్) భరించాలి. ఇందుకు విరుద్ధంగా హమాలీ పేరిట సాగుతున్న దోపిడీ వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఏకరువు పెడుతున్నారు.

మిగతా 6వ పేజీలో

ఖైదీలకు ఉచిత న్యాయసేవలు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి



సదస్సులో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి

ఆదోని, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలు పొందేందుకు న్యాయవాదిని నియమించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి తెలిపారు. గురువారం ఆయన ఆదోని సబ్‌జైలును తనిఖీ చేశారు. ముందుగా జైలు ప్రాంగణాన్ని పరిశీలించారు. ఖైదీల యోగక్షేమాలు, ఆహార సరఫరా, వైద్య సదుపాయలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖైదీలందరికీ ఉచిత న్యాయవాది కల్పించే వెసులుబాటు ఉందన్నారు. కోర్టు ప్రాంగణంలో నిర్మిస్తున్న నూతన కోర్టు భవనాన్ని పరిశీలించారు. కోర్టు నిర్మాణంతో ఇబ్బందులు పడుతున్నామని, త్వరగా పూర్తిచేయాలని న్యాయవాదులు విన్నవించారు. ఏడాదిలోగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా న్యాయాధికారి పి.జె.సుధ, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ లీలా వెంకటశేషాద్రి, సీనియర్ సివిల్ న్యాయాధికారి యజ్ఞనారాయణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారులు అర్చన, డాక్టర్ విష్ణు, జైలు సూపరింటెండెంట్ నజీర్‌అహ్మద్, లీగల్ ఎయిడ్ న్యాయవాది సి.ఆనంద్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బార్ లైసెన్సీ ప్రక్రియ పూర్తి

- దరఖాస్తుల ద్వారా రూ.5.15 కోట్ల ఆదాయం
- 26 బార్లలో 24కు లైసెన్సులు జారీ



లాటరీ పద్ధతిన బార్లకు ఎంపిక చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవ్య

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బార్ నూతన లైసెన్సీ ప్రక్రియ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 26 బార్లకు కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయగా రెండు విడతల్లో 24 బార్లకు లైసెన్సు జారీ ప్రక్రియ రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.హనుమంతరావు, సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు ఆధ్వర్యంలో ఇన్‌చార్జి కలెక్టర్ బి.నవ్య చేత లాటరీ పద్ధతిన ఎంపిక చేయించారు. 24 బార్లకు దరఖాస్తుల ద్వారా రూ.5.15 కోట్ల ఆదాయం సమకూరింది. ఎమ్మిగనూరు, గూడూరుల్లో రెండు బార్లకు లైసెన్సు కోసం ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో వాటి ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిలిపివేసింది. లాటరీ ప్రక్రియన ఎంపికైన దరఖాస్తు దారులు వెంటనే ఆరో వంతు లైసెన్సు రుసుం చెల్లించారు. అడిషనల్ ఆర్‌ఈటీ మొత్తాన్ని చెల్లించిన వారికి ప్రొవిజనల్, తాత్కాలిక లైసెన్సు మంజూరు చేశారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తి అయ్యాక బారు ప్రదేశాన్ని తనిఖీ చేసి శాశ్వత లైసెన్సులను మంజూరు చేస్తారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఏఈఎస్‌లు రాజశేఖర్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, సీఐలు రాజేంద్రప్రసాద్, చంద్రహాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధేయుడికి అందలం

- శ్రీశైలం ఆలయ చైర్మన్‌గా రమేష్ నాయుడు

6



వైద్య కళాశాల వద్ద ఉద్రిక్తత

- విద్యార్థి సంఘాల ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- విద్యార్థులు, పోలీసుల మధ్య తోపులాట
- సీఐ, ఎస్ఐకి గాయాలు



ఎస్ఎఫ్ఐ నాయకులను వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

ఆదోని అగ్రికలర్ / రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని అరేకల్లు గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద గురువారం ఉద్రిక్తత నెలకొంది. మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు మెడికల్ కళాశాల భవనాన్ని ముట్టడికి పిలుపునిచ్చారు. అప్పటికే కూటమి నాయకులు వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మెడికల్ కళాశాలను పరిశీలించేందుకు వెళ్లారు. విద్యార్థులకు, కూటమి నాయకులకు మధ్య ఘర్షణ తలెత్తుతుందని అక్కడికి వెళ్తున్న వారిని మార్గమధ్యలోనే పోలీసులు అడ్డుకున్నారు. ఇస్వీ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నాయక్ ఎస్ఎఫ్ఐ నాయకులకు కొద్దిసేపు ఇక్కడే ఉండాలని, కూటమి నాయకులు వెళ్లారని నచ్చజెప్పారు. కూటమి నాయకులకు అనుమతి ఇచ్చి మాకెందుకు ఇవ్వడం లేదంటూ ప్రశ్నించారు. ఎంతసేపైనా ముందుకు కదలనివ్వకపోవడంతో మెడికల్ కళాశాల భవనం ముట్టడికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. తాలూకా సీఐ నల్లప్ప, ఎస్ఐలు నాయక్, రామాంజులు, పోలీసులు బలవంతంగా విద్యార్థులను, ఎస్ఎఫ్ఐ నాయకులను స్టేషన్‌కి తరలించే ప్రయత్నం చేయగా వారు తిరగబడ్డారు. పోలీసులు, విద్యార్థుల మధ్య తీవ్రమైన తోపులాట జరిగింది. బలవంతంగా విద్యార్థి సంఘ నాయకులను వాహనంలోకి ఈడ్చికెళ్లారు. తోపులాట మధ్య తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐ నల్లప్ప, ఇస్వీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ డాక్టర్ నాయక్‌కు చేతులకు, మోచేతికి గాయాలయ్యాయి. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లానాయకుడు రవితో పాటు మరికొంత మందిని తాలూకా స్టేషన్‌కు తరలించారు.



మెడికల్ కళాశాల భవనాన్ని ముట్టడిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను వాహనంలోకి ఈడ్చికెళ్తున్న పోలీసులు

ఎస్ఎఫ్ఐ నాయకులపై కేసు నమోదు

ప్రభుత్వ మెడికల్ కళాశాల ముట్టడికి వెళ్లిన 9 మంది ఎస్ఎఫ్ఐ నాయకులపై గురువారం తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు ఎస్ఎఫ్ఐ నాయకులు కురువ శ్రీనివాసులు, రంగప్ప, సాయి ఉదయ్, విజయ్ కుమార్, విల్సన్, చాకలి రావు, దేవానస్, మీరాజ్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ నల్లప్ప తెలిపారు.

జీజీహెచ్‌లో స్కానింగ్ కేంద్రాల తనిఖీ

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'స్కానింగ్ టోకెన్ల కోసం పడిగాపులు' అన్న ఆంధ్రజ్యోతి కథనానికి కర్నూలు జీజీహెచ్ అధికారులు స్పందించారు. గురువారం ఉదయం న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ లోని స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సీఎస్ఆర్ఎంవో డాక్టర్ టీసీహెచ్ వెంకటరమణ, డయోగ్నస్టిక్ బ్లాక్ ఇన్‌చార్జి సునీల్ ప్రశాంత్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ అసోసియేట్ ప్రొఫెసర్ శివబాల స్కానింగ్ కోసం వచ్చిన రోగులకు ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్పిటల్ సూపరింటెండెంట్ రేడియాలజి విభాగపు వైద్యులతో సమావేశం నిర్వహించారు. స్కానింగ్‌కు వచ్చే రోగులకు త్వరితగతిన పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతిరోజు 450 అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహిస్తారని, న్యూడ యోగ్నస్టిక్ బ్లాక్‌లో బుధవారం ఉదయం 164 మందికి, మధ్యాహ్నం 108మంది పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇక నుంచి రోగులకు అవసరమైతేనే అల్ట్రాసౌండ్ పరీక్షలు రాయాలని సంబంధిత విభాగాల ప్రొఫెసర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కవి సమ్మేళనాలు దోహదం

● అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ వీసీ పీఎస్ షావలి ఖాన్



కవి సమ్మేళనంలో పాల్గొన్న ఉర్దూ యూనివర్సిటీ వీసీ పీఎస్ షావలి ఖాన్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉర్దూ భాషాభివృద్ధికి కవి సమ్మేళనాలు దోహదపడుతాయని అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ వీసీ పీఎస్ షావళి ఖాన్ అన్నారు. గురువారం యూనివర్సిటీలో ఈద్-ఏ-మిలాదున్-నబీ సందర్భంగా ఒక్క రోజు కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సమాజ శ్రేయస్సు కోసం నేర్పిన సూత్రాలను పాటిస్తూ ఆయన అడుగు జాడల్లో నడవాలన్నారు. ఆన్ లైన్ ద్వారా ముఖ్యఅతిథిగా ఎన్ సీపీయూఎల్ డైరెక్టర్ డాక్టర్ ఎండీ షంసు ఇక్బాల్ మాట్లాడారు. ఉర్దూ భాషా వాడుక భాషలో ఒక మాధ్యమంగా పని చేస్తుందన్నారు. లతీఫ్ షా లౌబాలి దర్గా పీఠాధిపతులు సయ్యద్ షా అబ్దుల్లా హుస్సేనీ బాద్షా ఖాద్రీ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త శాంతి కోసం నిరంతరం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ లోక్‌నాథ్, కవులు అబ్దుల్ జిలానీ, అతవుల్లాహ్ ఖాద్రీ, ఖాద్రీ రసూల్, యూసిస్ బోఖారీ, జీబా ఫాతీమా, ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్‌బాషా, కన్వీనర్ ఎస్ఎస్ఎం హుస్సేనీ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు మహానందిలో ఏర్పాట్లు



మహానందిలో ప్రత్యేక యాగశాల నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

మహానంది, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో 11 రోజుల పాటు జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు గురువారం నుంచి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈనెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జరిగే కామేశ్వరీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను దాతల సహకారంతో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రత్యేక విద్యుత్ అలంకరణ పనులతో పాటు చండీ హోమాలు నిర్వహించేందుకు గాను ఆలయ రెండో ప్రాకారం ఆవరణలో యాగశాలలను నిర్మిస్తున్నారు. అలాగే నంద్యాలకు చెందిన గురు రాఘవేంద్ర విద్యాసంస్థల అధినేత షేక్షావలి రెడ్డి, సింధూ దంపతులు రూ.50 వేలతో కలశ స్థాపన పీఠాలతో పాటు యాగశాలకు ఫ్యాన్లు, విద్యుత్‌దీపాలను అందజేస్తారని ఆలయ అధికారులు వెల్లడించారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో సినీ ప్రముఖులు



మంత్రాలయంలో సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్, ఎంఎం కీరవాణి

మంత్రాలయం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ప్రముఖ సినీ దర్శకులు ఎస్.ఎస్.రాజమౌళి తండ్రి, సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్, సంగీత దర్శకులు ఎం.ఎం. కీరవాణి, ఎం.ఎం.కళ్యాణ్ మాలిక్ కుటుంబ సమేతంగా గురువారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వీరికి మహా ముఖద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతిఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘన స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

పులకించిన ప్రకృతి



హరివిల్లు, చిరుజల్లు, చుక్కలు, ఆకాశం... ఇలా అన్నీ అందరి కోసం అంటూ ఓ సినీ కవి వర్ణిస్తే.. ఆకాశంలో అందమైన రంగుల చాపం ఇంద్ర ధనుస్సు కూడా వర్ణించలేని మరో అందమే. ఉయ్యాలవాడ మండలంలో గురువారం సాయంత్రం సప్తవర్ణాలు ఏకమై ఆకాశంలో అర్ధవృత్తాకారంలో ఏర్పడిన ఇంద్రధనుస్సు చూపరులను ఆకట్టుకుంది. ఆ హరివిల్లు అందాలకు ప్రకృతి సైతం పులకించింది. సాయం సంధ్యవేళ ఏర్పడిన ఈ ఇంద్ర ధనుస్సును కూలీలు, ప్రజలు ప్రత్యేకంగా వీక్షించారు.

● ఉయ్యాలవాడ, ఆంధ్రజ్యోతి

నిన్న ఆనందం.. నేడు నైరాశ్యం..!

● నియామక పత్రాల అందజేత వాయిదా

● భారీ వర్షాల నేపథ్యంలో రద్దు చేశామన్న అధికారులు

● కర్నూలు నుంచి వెనుదిరిగిన అభ్యర్థులు, బంధువులు



రాయలసీమ యూనివర్సిటీలో డీఎస్సీ-25 ఎంపికైన అభ్యర్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మరి కొన్ని గంటల్లో తమకు ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుతాయని వారు ఆనందం పడ్డారు. బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలుకు చేరుకున్నారు. అంతలోనే వారికి ఓ చేదువార్తను అధికారులు చెప్పారు. దీంతో వారంతా నిరాశకు గురయ్యారు. విజయవాడలో జరిగే ఉపాధ్యాయ నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని గురువారం చివరి నిమిషాల్లో అర్థాంతరంగా వాయిదా వేశారు. ఎప్పుడు ఉంటుందో జిల్లా విద్యా శాఖాధికారుల ద్వారా తెలియజేస్తామని జాయింట్ కలెక్టర్ చెప్పారు. విజయవాడలో భారీ వర్షాలు కురుస్తుండడంతో అభ్యర్థులతో పాటు, బంధువులు వసతి సౌకర్యాలు ఏర్పాటులో ఇబ్బందులు ఉంటాయని భావించిన రాష్ట్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

రాత్రంతా ప్రయాణించి.. అలసిపోయి..

ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా నాన్‌లోకల్ అభ్యర్థులు, బంధువులు శ్రీకాకుళం, విజయనగరం, విజయవాడ, గుంటూరు, నల్గొండ, మెదక్ ప్రాంతాల నుంచి రాత్రంతా ప్రయాణించి కర్నూలుకు చేరుకున్నారు. గురువారం ఉదయం అంతా రాయలసీమ యూనివర్సిటీకి చేరుకోవడంతో ఆ ప్రాంతం జన జాతరగా మారింది. అభ్యర్థులు, బంధువులు, అధికారులు కలిపి దాదాపు 8వేల మంది దాకా వచ్చినట్లు అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 134 ఆర్టీసీ బస్సులతో యూనివర్సిటీ ఆవరణం కిక్కిరిసింది. వచ్చిన వారందరికీ అల్పాహారం, తాగునీటిని సరఫరా చేశారు. మరి కొన్ని గంటల్లో ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకుంటామని భావించిన అభ్యర్థులకు నిరాశే ఎదురైంది. కార్యక్రమం వాయిదా పడింది. ఇక్కడికి చేరుకున్న వారందరూ ఇబ్బందులు పడకుండా నియోజవర్గాలవారీగా ఆయా ఆర్టీసీ బస్సుల్లో ఎక్కించి స్వస్థలాలకు పంపారు. ఎవరి ప్రాంతాలకు వారు వెనుదిరిగి వెళ్లారు.



ప్రయాణం రద్దు అయినట్లు ప్రకటిస్తున్న జేసీ నవ్య



ఆర్టీసీ బస్సులో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులు

నిండా ముంచేశారు..!

5వ పేజీ తరువాయి

ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.1,200 ప్రకారం 6,057 మెట్రిక్ టన్నులు (60,570 క్వింటాళ్లు) కొనుగోలు చేసింది. 1,21,140 బస్తాలు ఉల్లి దిగుబడులు రైతుల నుంచి సేకరించారు. మార్కెట్ నిబంధనలు ప్రకారం కొనుగోలు తరువాత కాటా, సంచుల్లోకి నింపడం, సంచులు కుట్టేందుకు పురికోస (చిన్నపాటి తాడు), లోడింగ్ ఖర్చులు ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థనే భరించాలి. వీటి కోసం బస్తాకు రూ.18 చెల్లిస్తున్నామని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు రాజు తెలిపారు. ఇందుకు విరుద్ధంగా కాటా, సంచులకు నింపడం, పురికొస కొనుగోలు చేయడం వంటి హమాలీ ఖర్చుల రూపంలో ముక్కుపిండి వసులు చేస్తున్నారని, బస్తాకు రూ.40-45 వరకు భరించామని, పురికోస కిలో రూ.150కు కొనుగోలు చేసి హమాలీలకు ఇచ్చామని ఉల్లి రైతులు ఏకరువు పెడుతున్నారు. ఈ లెక్కన సుమారుగా రూ.55 లక్షల వరకు రైతుల నుంచి అక్రమంగా వసులు చేసినట్లు ఆరోపణలు బలంగా ఉన్నాయి. హమాలీలు వసులు చేశారా? ఆ పేరిట కమిషన్ ఏజెంట్లు వసులు చేశారా? మార్కెట్ సూపర్‌వైజర్లు, కమిషన్ ఏజెంట్లు కుమ్మక్కై హమాలీ ఖర్చుల పేరిట దోపిడీ చేశారా? అన్నది అధికారులే చెప్పాలి. ఏపీ మార్క్‌ఫెడ్, లైసెన్సుడ్ వ్యాపారులు ఉల్లి సేకరించిన రైతుల జాబితా మార్కెట్ అధికారుల వద్ద ఉంటుంది. ఏసీబీ లేదా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమగ్ర విచారణ చేయిస్తే దోపిడీ బాగోతం వెలుగు చూస్తుందని పలువురు పేర్కొంటున్నారు.



బస్తాకు రూ.18 చెల్లిస్తున్నాం

కర్నూలు మార్కెట్ యార్డులో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1,200 ప్రకారం 6,057 మెట్రిక్ టన్నులు సేకరించాం. కొనుగోలు చేసిన తరువాత కాటా, సంచులకు నింపడం, లోడింగ్.. వంటి హమాలీ ఖర్చులు బస్తాకు రూ.18 ఏపీ మార్క్‌ఫెడ్ చెల్లిస్తుంది. ఈ లెక్కన రూ.21.80 లక్షలు భరిస్తున్నాం. రైతులు ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. పురికోస కూడా మేమే కొనుగోలు చేశాం. రైతుల నుంచి అక్రమంగా వసూలు చేయడంపై మార్కెట్ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తాను.

● రాజు, ఏపీ మార్క్‌ఫెడ్, జిల్లా మేనేజరు, కర్నూలు

అక్రమ వసూళ్లపై విచారణ చేయిస్తా



రైతులు పంట దిగుబడులు మార్కెట్‌కు తెస్తే, కొనుగోలుకు ముందు, కొనుగోలుకు తరువాత రెండు రకాల హమాలీ ఖర్చులు ఉంటాయి. పంట మార్కెట్‌కు తెచ్చాక సంచులు దింపడం (అన్‌లోడింగ్), కోసి కుప్ప వేయడం, చాటా నింపుట.. ఈ మూడింటికి బస్తాకు రూ.15.12లు రైతులే భరించాలి. కొనుగోలు (ట్రేడింగ్) జరిగిన తరువాత కాటా, సంచులకు నింపడం, సంచులు కుట్టడం, పురికోస కొనుగోలు, లోడింగ్.. వంటి హమాలీ ఖర్చులు బస్తాకు దాదాపు రూ.18లు కొనుగోలుదారులే భరించాలి. రైతుల ఉంచి ఒక్కపైసా కూడా వసులు చేయరాదు. అక్రమంగా వసులు చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. రైతులు, వ్యాపారులతో మాట్లాడమే కాకుండా దీనిపై విచారణ చేయించి నిజమని తేలితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాను.

● జయలక్ష్మి, స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ, మార్కెట్ యార్డు, కర్నూలు

ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా బీటీ నాయుడు

● శాసన మండలిలో బాధ్యతల స్వీకరణ



శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు సమక్షంలో ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బీటీ నాయుడు, చిత్రంలో కమిటీ సభ్యులు ఉన్నారు.

కర్నూలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో కీలకమైన ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ బీటీ నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు బీటీ నాయుడుతో ప్రమాణం చేయించారు. కర్నూలు జిల్లాలో టీడీపీ కీలక నాయకుడిగా ఎదుగుతూ రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయనకు ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా ప్రభుత్వం అవకాశం కల్పించింది. సభా, సభ్యుల హక్కుల రక్షణలో ఈ కమిటీ ప్రత్యేకంగా పని చేస్తుంది. అదే క్రమంలో సభ్యులు సభాహక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకోవడంతో పాటు సమస్య తీవ్రంగా ఉంటే సస్పెండ్ చేసే అవకాశం కూడా ఈ కమిటీకి ఉంటుంది. చైర్మన్ బీటీ నాయుడుతో పాటు కమిటీ సభ్యులు జయేంద్రభరత్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పి. రవీంద్రబాబు, రాఘురాం, రాజగోళ్ల రమేశ్‌యాదవ్‌లు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తనపై ఎంతో నమ్మకంతో ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ పదవికి ఎంపిక చేశారన్నారు. వెనుకబడిన కోసిగి ప్రాంతానికి చెందిన తనకు ఈ పదవి రావడం జీవితంలో కీలక ఘట్టమన్నారు. ప్రస్తుతం సభా హక్కులు, సభ్యుల హక్కులు ఉల్లంఘనలపై 37 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని విచారించి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సభా, సభ్యుల హక్కులకు రక్షణగా ఉంటానని తెలిపారు.

విధేయుడికి అందలం

● శ్రీశైలం ఆలయ చైర్మన్‌గా పోతుగుంట రమేష్ నాయుడు

● ఆయన స్వస్థలం అన్నమయ్య జిల్లా రాజంపేట

● బీజేపీలో క్రియాశీలక నేతగా గుర్తింపు



ప్రధాని నరేంద్ర మోదీతో రమేష్ నాయుడు (ఫైల్)

నంద్యాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, విధేయుడిగా పోతుగుంట రమేష్ నాయుడును పార్టీ గుర్తించింది. సామాన్య కార్యకర్తగా ఎదిగిన ఆయన్ను శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున ఆలయ పాలక మండలి చైర్మన్‌గా ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అన్నమయ్య జిల్లా రాజంపేట మండ లం కూచివారిపల్లి పంచాయతీ వైబీఎన్ గ్రామానికి చెందిన పోతుగుంట రమేష్ నాయుడు ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్‌లో పనిచేసి గుర్తింపు పొందారు. తర్వాత బీజేపీలో ఉంటూ పలు పదవులను చేపట్టారు. 2019 ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి అబ్జర్వర్‌గా అదనపు బాధ్యతలు చూసుకుంటున్నారు. బీజేపీలో అంచలంచెలుగా ఎదిగిన ఆయనకు రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు(రాజంపేట) కీలక నాయకులతో సాన్నిహిత్యం ఉంది. 30 ఏళ్లుగా బీజేపీలో వివిధ హోదాల్లో ఆయన పనిచేసి గుర్తింపు పొందారు. దీంతో విధేయతను గుర్తించిన బీజేపీ శ్రీశైలం పాలకమండలి అధ్యక్షుడిగా అవకాశం కల్పించింది. పాలకమండలి చైర్మన్‌గా ఎంపికైన రమేష్ నాయుడుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, ఆ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

పార్టీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు

శ్రీశైల ఆలయ పాలకమండలి చైర్మన్‌గా అవకాశం కల్పించిన బీజేపీ పెద్దలకు, సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు. నాపై నమ్మకంతో పెద్ద బాధ్యతను అప్పగించారు. ఆలయ అభివృద్ధికి, క్షేత్ర గుర్తింపునకు కృషి చేస్తాను.

● పోతుగుంట రమేష్ నాయుడు

పత్తి పంటలో గంజాయి సాగు

కర్నూలు జిల్లా ఆదోనిలో సంఘటన





పత్తి పంటతో పాటు సాగు అవుతున్న గంజాయి మొక్కలు

ఆదోని రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి సాగు, రవాణా పూర్తిగా నిషేధం. కానీ ఆదోని మండలంలో ఓ వ్యక్తి పత్తిపంటలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నాడు. ఆదోని మండలం కుప్పగల్లు గ్రామంలో దివ్యాంగుడు వెంకటేశ్ తనకున్న 3.5 ఎకరాల పొలంలో పత్తి పంటను సాగు చేస్తున్నాడు. అయితే గ్రామస్థుల ద్వారా సమాచారం తెలుసుకున్న పెద్ద తుంబళం పోలీసులు గురువారం పత్తిపంటను పరిశీలించారు. అక్కడ పత్తిమొక్కల మాటున 9 గంజాయి మొక్కలను పోలీసులు గుర్తించారు. వెంటనే ఆ గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. సదరు రైతు వెంకటేశ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై ఆదోని రూరల్ సీఐ నల్లప్పను వివరణ కోరగా కుప్పగల్‌కు చెందిన వెంకటేష్ తన మూడున్నర ఎకరాల పొలంలో పత్తి పంటతో పాటు గంజాయిని సాగు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.

దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

శ్రీశైలం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాలకు రావాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సీఎం చంద్రబాబు నాయుడుకు ఆహ్వానం పలికారు. న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు, అర్చకులు గురువారం ముఖ్యమంత్రి కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ముఖ్యమంత్రికి శేష వస్త్రాలు, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. అలాగే దేవదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డికి పత్రికను అందజేసి ఆహ్వానించారు.



ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్, ఈవో

నాగంపల్లి సొసైటీ సీఈవోపై కేసు నమోదు

కొత్తపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంపల్లి సహకార సొసైటీ సీఈవో కోటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు కొత్తపల్లి ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. గురువారం ఎస్ఐ తెలిపిన వివరాలివీ.. కోటేశ్వరరావు నాగంపల్లి సొసైటీ సీఈవోగా 2022 నుంచి విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు సొసైటీలో తీసుకున్న రుణాలను రూ.42,40,160 వసూలు చేసుకుని సొసైటీలో జమ చేయకుండా తన సొంత అవసరాలకు వాడుకున్నట్లు చెప్పారు. రైతులకు కూడా తప్పుడు రసీదులు ఇచ్చి మోసం చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. వీటిపై ఈ ఏడాది జూన్‌లో సొసైటీ ఉన్నతాధికారులు కోటేశ్వరరావుపై అంతర్గత విచారణ చేపట్టగా.. సొసైటీకి మోసం చేసినట్లు గుర్తించి సస్పెండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సొసైటీని మోసం చేసినట్లు గుర్తించి నాగంపల్లి సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈవో కోటేశ్వరరావుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పట్టణంలని శక్తినగర్‌లో చోటుచేసుకున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. శక్తి నగర్‌కు చెందిన శ్రీరాములు, శంకుతల దంపతుల కుమారుడు మధు(21). అతడి తండ్రి ఆటో నడుపుతున్నాడు. తల్లి మార్కెట్లో కూరగాయల వ్యాపారం చేస్తుంది. మధు వాటర్ క్యాన్లు సప్లై చేస్తూ జీవనం సాగించేవాడు. కొన్ని రోజుల నుంచి అతడు మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. బుధవారం తల్లిదండ్రులు ఇరువురు ఎవరి పనిమీద వారు వెళ్లారు. రాత్రి 8గంటల సమయంలో మధు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు వచ్చి చూసి హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య.. 9 మందిపై కేసు

కొత్తపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసలిమడుగు గ్రామంలో బోయ వెంకటేశ్వర్లు (40) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కొత్తపల్లి ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. వివరాలివీ.. గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వర్లు, అదే గ్రామానికి చెందిన సామేలు అనే వ్యక్తిని గొర్రె దొంగలించాడన్న నెపంతో తీవ్రంగా కొట్టాడు. ఈ విషయంపై ఇదే గ్రామానికి చెందిన జెల్లి చిన్న లింగస్వామి, జెల్లి ఆంజనేయులుతో పాటు మరో ఏడుగురి కలిసి సామేల్‌ని ఎలా కొడుతావని చెప్పి వెంకటేశ్వర్లును బెదిరించారు. మనస్తాపానికి గురైన వెంకటేశ్వర్లు గురువారం తెల్లవారుజామున గొర్రెల వ్యాధులకు ఉపయోగించే మందు తాగడంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన వెంకటేశ్వర్లును ఆత్మకూరులోని వైద్యశాలకు తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతి చెందాడు. వెంకటేశ్వర్లు భార్య వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు 9 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చాగలమర్రిలో డిగ్రీ విద్యార్థిని కిడ్నాప్!

- ఆరా తీస్తున్న సీఐ, ఎస్ఐలు

చాగలమర్రి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి డిగ్రీ చదువుతున్న విద్యార్థినిని గురువారం కిడ్నాప్ చేసిన సంఘటన కలకలం రేపింది. కడప జిల్లా కానగూడురుకు చెందిన విద్యార్థిని చాగలమర్రి డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతోంది. స్వగ్రామం కానగూడురు నుంచి ఉదయం కళాశాలకు వచ్చి ఇంటికి వెళ్లాలని ప్రిన్సిపాల్ అనుమతి తీసుకొని మధ్యాహ్నా బయటకు వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి తీసుకొని వెళ్లారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐలు సురేష్, వరప్రసాద్, రామిరెడ్డి పర్యవేక్షణలో పోలీసులు ఆరా తీస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల కారును, ఆ వ్యక్తులను పట్టుకునేందుకు ముమ్మరంగా గాలింపు చేపట్టారు.

నంద్యాలలో చోరీ

- సూపర్ మార్కెట్‌లో రూ.30 వేలు, జనరల్ స్టోర్‌లో రూ.15 వేలు అపహరణ

నంద్యాల టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): టూటౌన్ పరిధిలో శ్రీరామ థియేట్ ఎదురుగా ఉన్న అంజనా సూపర్ మార్కెట్‌లో, అలాగే విశ్వనగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర జనరల్ స్టోర్‌లో బుధవారం రాత్రి దొంగతనాలు జరిగాయి. టూటౌన్ సీఐ అస్రర్‌బాషా తెలిపిన వివరాలివీ.. అంజనా సూపర్ మార్కెట్‌లో గుర్తు తెలియని దుండగులు షెట్టర్ పగలగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. ఉదయం పేపర్ బాయ్స్ సమాచారంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారుగా రూ.30 వేలు నగదు పోయినట్లు బాధితులు తెలిపారు. అలాగే జనరల్ స్టోర్‌లో రూ.15 వేలు నగదు ఎత్తికెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఘటనలపై కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దారి దోపిడీ

నంద్యాల టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు నగరం వద్ద మూడు రోజుల క్రితం దారి దోపిడీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన ఒక యువకుడు ఈనెల 15న రాత్రి డాబాలో భోజనం చేసి వెళ్తున్న సమయంలో పక్కకు ఆగి ఉన్నాడు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బెదిరించి 1.5 తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో - బొలేరో ఢీ

- ఒకరి మృతి - ఆరుగురికి తీవ్ర గాయాలు

అవుకు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత చెర్లోపల్లె మెట్ట సమీపంలోని మలుపు వద్ద ప్రయాణికులతో వెళుతున్న ఆటోను బొలేరో వాహనం ఢీకొట్టడంతో నులక రాముడు (63) మృతి చెందాడు. ఆనంద్‌శర్మ, లక్ష్మీదేవి, పుల్లమ్మ, డ్రైవర్ లతీఫ్ తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఉదయం రామాపురం, చెర్లోపల్లె గ్రామాలకు చెందిన ఏడుగురు ఉదయం 8-45 గంటల సమయంలో ఆటోలో అవుకుకు బయలు దేరారు. ఆటో పాత చెర్లోపల్లె మెట్ట సమీపంలోని మలుపు వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న ట్యాలీ బొలేరో వాహనం ఆటోను ఢీకొట్టింది. నులక రాముడు అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడ్డ వారిని 108 ద్వారా అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ రాజారెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుల మధ్య వాగ్వాదం

- పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య గురువారం ఉదయం వాగ్వాదం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. వాట్సాప్ గ్రూపులో బుధవారం రాత్రి ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టడంతో వివాదం తలెత్తింది. దీంతో గురువారం ఉదయం తమ ఉపాధ్యాయ సంఘం నాయకుడితో సదరు ఉపాధ్యాయుడు పక్కనే ఉన్న పాఠశాలకు వచ్చారు. అర్ధరాత్రి వేళ అసభ్యకరమైన వ్యాఖ్యలు పోస్టు చేసి కించపరచే విధంగా మాట్లాడడమేమిటని ప్రశ్నించారు. ఇరువురి మధ్య మాట మాటా పెరిగి ఒకరిపై ఒకరు చేయి చేసుకునే వరకు వచ్చింది. పక్కనే ఉన్న ఉపాధ్యాయులు ఇరువురికి సర్ది చెప్పి పంపారు. మునిసిపల్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం సుధాకర్‌కు ఉపాధ్యాయ సంఘ నాయకుడు గతంలోనూ ఇలాగే విమర్శలు చేశారని మళ్లీ బుధవారం రాత్రిక కూడా అలాగే ప్రవర్తించారని చర్యలు తీసుకోవాలంటూ రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సదరు ఇన్‌చార్జి హెచ్ఎం దీనిపై వచ్చాక మాట్లాడదామని డిప్యూటీ ఈవో, ఎంఈవో దృష్టి కూడా తీసుకెళ్తానని తెలిపారు. అయితే చర్యలు తీసుకోకపోవడంతో రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సదరు ఉపాధ్యాయుడిపై ఫిర్యాదుచేశారు. సీఐ రాజశేఖర్ రెడ్డి ఎంఈవో-2 శ్రీనివాసులు, ఇన్‌చార్జి హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయుడిని స్టేషన్‌కి పిలిపించి విచారించారు. రాత్రి వాట్సప్ గ్రూప్‌లో అసభ్యకరంగా మాట్లాడారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై డిప్యూటీ డీఈవో వెంకటరమణతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి విచారిస్తామని సీఐకి తెలపడంతో రాతపూర్వకంగా రాసిచ్చి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు. సీఐ రాజశేఖర్ రెడ్డిని వివరణ కోరగా డిప్యూటీ ఈవోతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అక్కడితో గొడవ సద్దుమణిగింది.

ఇన్‌చార్జిలే దిక్కు..

- 11 నెలలైనా భర్తీ కాని జిల్లా రిజిస్ట్రార్ పోస్టు
- పేరుకుపోయిన ఫైళ్లు
- ముందుకు సాగని పాలన
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కల్లూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా దర్శనమిస్తోంది. జిల్లా రిజిస్ట్రార్‌ను నియమించడంలో ఉన్నతాధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దాదాపు 11 నెలలుగా కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఫైల్స్ పేరుకుపోయి పాలన ముందుకు సాగడం లేదు. ఇన్‌చార్జిలతో కాలం వెల్లదీస్తున్నారు. రెగ్యులర్ రిజిస్ట్రార్ నియమించడంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా రిజిస్ట్రార్ ఫేషీలో ఫైళ్లు ముందుకు కదలక, సమస్యలకు పరిష్కారం దొరక్క ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల అలసత్వం..

కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ ఫేషీలో ఫైళ్లు పేరుకుపోతున్నాయని వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ డీఆర్ లేకపోవడంతో ఇన్‌చార్జిలకు బాధ్యత అప్పగించారు. ఈ తలనొప్పులు మాకెందుకులే అని ఇన్‌చార్జ్ డీఆర్‌గా పనిచేస్తున్న అధికారులు ప్రజలు, వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దాదాపు 11 నెలలుగా డీఐజీతో కలిసి నలుగురు అధికారులు జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేసినా ఏఒక్క పని జరగలేదని ప్రజలు వాపోతున్నారు. సొసైటీ నూతన దరఖాస్తులు, అనుమతులు, చిట్‌ఫండ్ కొత్త దరఖాస్తులు, రెన్యూవల్ నిలిచిపోయాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎడిట్ ఇన్‌డెక్స్ (ఈసీల్లో తప్పుల సవరణ జిల్లా వ్యాప్తంగా)జరగడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో జరిగే అవకతవకలు, తప్పుడు, ఫేక్ రిజిస్ట్రేషన్లపై ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కర్నూలు జిల్లా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ, ఐజీ అధికారులు కూడా రెగ్యులర్ డీఆర్‌ను నియమించడంలో విఫలం అయ్యారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

ఇంకెన్నాళ్లు ఇలా..

2024 సెప్టెంబరు 22న కర్నూలు జిల్లాకు సీహెచ్.నాగమల్లీశ్వరరావు డీఆర్‌గా విధుల్లో చేరారు. అనంతరం ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో ఆయన విశాఖపట్నం డీఆర్‌గా వెళ్లారు. కొంతకాలం డీఐజీ కళ్యాణి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. తర్వాత చెన్నకేశవరెడ్డికి ఇన్‌చార్జ్ డీఆర్‌గా అప్పగించారు. తాత్కాలికంగా సేవలందించి సెలవుపై వెళ్లారు. ఆతర్వాత అనంతపురం జిల్లా డీఆర్ భార్గవ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వగా అరకొరగా పనిచేస్తూ అటువైపు రాలేదని ప్రజలు ఆందోళన చెందారు. ఆయన స్థానంలో నంద్యాల డీఆర్ జానకీదేవిని కర్నూలు డీఆర్‌గా ఇన్‌చార్జ్ ఇవ్వగా అడపాదడపా ప్రజలకు దర్శనమిచ్చారు. మళ్లీ ఆమె స్థానంలో అనంతపురం జిల్లా డీఆర్ భార్గవ్‌ను కర్నూలు డీఆర్‌గా ఇన్‌చార్జ్ ఇవ్వడంతో ప్రజలే ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వినియోగదారుల పట్ల స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు చిత్తశుద్ధి లేదని రెగ్యులర్ రిజిస్ట్రార్‌ను నియమించడంతో మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రజలు, క్రయ విక్రయదారులు సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కర్నూలుకు రెగ్యూలర్ జిల్లా రిజిస్ట్రార్‌ను నియమించాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



తెరుచుకోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ తలుపు

వెలుగులో చీకట్లు

- అవినీతికి తెరలేపిన బుక్ కీపర్లు
- మోసపోతున్న సామాన్యులు
- విచారణ చేపట్టిన అధికారులు



దేవనకొండలోని స్రీ శక్తి భవనం

దేవనకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఆర్థికంగా చేయూతను అందించే వెలుగు పథకంలో చీకట్లు కమ్ముకుంటున్నాయి. ప్రభుత్వం పది మంది సభ్యులతో పొదుపు సంఘాలుగా ఏర్పాటుచేసింది. నెలనెల పొదుపుతో పాటు, బ్యాంకు లింకేజీ రుణాలు, రూపాయి వడ్డీ రుణాలిస్తోంది. వెలుగు కార్యాలయంలో పనిచేసే కొంత మంది ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. అవినీతికి తెర లేపారు. మండలం లో 44 గ్రామాలకు 1519 పొదుపు సంఘాలు 56 మంది బుక్ కీపర్లు ఉన్నాయి. పేదల బతుకుల్లో వెలుగులు నింపేలా స్త్రీనిధి, ఉన్నతి తదితర పథకాలతో జీవనోపాధి ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో బుక్‌కీపర్లు కొందరు నిధులు పక్కదాని పట్టించి సామాన్యులను అందినకాడికి దోచుకుంటున్నారు.

చాలాచోట్ల బ్యాంకు లింకేజీ రుణాల కంతులలో తేడాలు ఉండటంతో సభ్యులు అదనపు కంతులు సైతం కట్టాల్సి వస్తుంది. మండలంలోని పి.కోటకొండలో స్త్రీనిధి కంతులను బ్యాంకులో ఆటో డెబిట్ పెట్టినా కూడా బుక్‌కీపర్ సభ్యుల నుంచి నగదు వసూలు చేసి తన అవసరాలకు వాడుకున్నాడు. తీరా సభ్యులు గుర్తించాక పొరపాటు జరిగిందంటూ కప్పిపుచ్చిన ప్రయత్నంచేశాడు. అధికారులు సైతం అవినీతిపై విచారణకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ ఏడాది స్త్రీనిధి లక్ష్యం రూ.7 కోట్లు గాను, ఇప్పటికి రూ.80లక్షలు మాత్రామే లబ్ధిదారులకు అందాయి. స్త్రీనిధి, ఉన్నతి నిధులు అసలైన పేదలకు అందని ద్రాక్షగానే మిగిలాయి.

నిధులు అందేలా చర్యలు తీసుకుంటాం



కోటకొండలో ఎనిమిది సంఘాల ఫిర్యాదుతో ఐదు సంఘాలను విచారించాం. మిగిలిన మూడు సంఘాలను త్వరలోనే విచారణ చేసి జిల్లా అధికారుల దృష్టికి తీసు కెళ్తాం. అవినీతి తావులేకుండా సభ్యులకు నిధులు అందేలా చర్యలు తీసుకుంటాం - **మాదుల లక్ష్మమ్మ, ఏపీఎం**

బాల కార్మికుల అక్రమ రవాణా ముఠా అరెస్టు

నంద్యాల టౌన్ సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను అక్రమంగా తీసుకెళ్తున్న ఒడిశాకు చెందిన ఏజెన్సీ వారిని నంద్యాల జీఆర్‌పీ పోలీసులు, ఏహెచ్‌టీయూ సంస్థ వారు గురువారం రాత్రి పట్టుకున్నారు. జీఆర్‌పీ ఎస్ఐ కుమారి తెలిపిన వివరాలివీ.. ఒడిశాకు చెందిన కొన్ని ఏజెన్సీల వారు బాల కార్మికులను అక్రమంగా పలు ప్రాంతాల్లో పని చే యడానికి తీసుకెళ్తుండగా ఏహెచ్‌టీయూ, బీపీఏ, నీడ్స్ సంస్థ ఆర్‌పీఎఫ్ ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా రైళ్లల్లో తనిఖీలు చేయగా అనుమానస్పదంగా కనిపించడంతో విచారించగా విషయం బయట పడినట్లు తెలిపారు. 9 మంది బాలకార్మికులను బరంపుర వద్ద ఎక్కించుకుని పలు ప్రాంతాల్లో బెంగళూరు, ఇంకా పలు ప్రాంతాల్లో పెయింటింగ్, టైల్స్ వేయడానికి, హోటళ్లల్లో పని చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఐదుగురిపై కేసు నమోదు చేసి మైనర్లను వారి సొంత గ్రామాలకు పంపిస్తామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో డీసీపీవో స్వప్న ప్రియదర్శిని , రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పాత నేరస్థుల అరెస్ట్

- లారీ డ్రైవర్లను బెదిరించి దోచుకోవడమే లక్ష్యం



అరెస్టు చూపుతున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

ఆలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి లారీ డ్రైవర్లను టార్గెట్ చేసి దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను ఆలూరు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఈనెల 5వ తేదీన అర్ధరాత్రి పట్టణంలోని అతిథి హోటల్ వద్ద జాతీయ రహదారిపై లారీని ఆపుకుని నిద్రిస్తున్న డ్రైవర్ నుంచి మొబైల్, డబ్బులు లాక్కోవడానికి ప్రయత్నించగా డ్రైవర్ ప్రతిఘటించడంతో చాకుతో దాడిచేసి పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దోపిడీ కేసు నమోదు చేశామన్నారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆదేశాల మేరకు సాంకేతికతను ఉపయోగించి దర్యాప్తు చేశారు. కర్ణాటకలోని చిక్కవద్దట్టి గ్రామం, గదగ్ జిల్లాకు చెందిన షికారి ప్రేమేష్, బళ్లారి జిల్లా బసరకోడూరు గ్రామానికి చెందిన మూర్తి అనే ఇద్దరూ జల్సాలకు అలవాటు పడ్డారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో డబ్బు, సెల్‌ఫోన్‌లు దొంగతనాలు చేస్తూ రాత్రిపూట రోడ్డు పక్కన నిద్రించే లారీ డ్రైవర్లను టార్గెట్ చేస్తూ కత్తులు, రాళ్లతో దాడి చేసి దోచుకునేవారు. గతంలో కూడా పలు కేసులు కూడా నమోదయ్యాయి. కర్నూలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్య కేసులో ప్రధాన ముద్దాయిలుగా ఉన్నారన్నారు. ఆదోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి మూడు చోరీ కేసుల్లో కూడా వీరు ముద్దాయిగా విచారణలో తేలిందన్నారు. కడప, ఆదోని సెంట్రల్ జైలులో శిక్ష కూడా అనుభవించారని తెలిపారు. ఈ కేసును చేధించిన ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషా, ఏఎస్ఐ చంద్రశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ రంగయ్య, కానిస్టేబుల్ కె.పరశురాం, సుధాకర్, వీరాంజి, రమేష్‌ను సీఐ అభినందించారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

- కాలి బూడిదైన సామగ్రి
- రూ.5లక్షలు నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంజీవయ్యనగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. స్టోరు రూంలో నిల్వ ఉంచిన వివిధ రకాల మందులు, ఫర్నిచర్, సామగ్రి దగ్ధమైనట్లు మెడికల్ ఆఫీసర్ శారద తెలిపారు. వివరాలు.. అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం సాయంత్రం 4గంటల సమయంలో స్టోర్ రూంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో బయట హాలులో ఓ నర్స్ తప్ప ఎవరూ కార్యాలయంలో లేరు. సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించగా అదుపు కాలేదు. విద్యుత్ సి బ్బందికి సమాచారమిచ్చి కరెంట్ సప్లై నిలిపివేశాం. అగ్ని మాపక దళానికి సమాచారమివ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే దాదాపు రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. వైద్య సిబ్బంది హాలులో ఉండటంతో ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి వచ్చి ఘటనాస్థలికి చేరుకొని తగులు సూచనలు చేసి మునిసిపల్ సిబ్బందికి కాలిన వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించారు.

విద్యుత్‌శాఖపై ప్రజల్లో సంతృప్తి పెరగాలి

- ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు దిశానిర్దేశం

కల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖపై ప్రజలు, వినియోగదారుల్లో సంతృప్తి స్థాయిని పెంచాలని అధికారులను ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఆదేశించారు. గురువారం దూపాడులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎస్ఈ ఎం.ఉమాపతి ఆధ్వర్యంలో ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఎండీ మాట్లాడుతూ వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా, పల్లెలు, పట్టణాల్లో లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా మెరుగైన విద్యుత్ ను సరఫరా చేయడమే లక్ష్యమన్నారు. పని చేస్తున్న చోట అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నారా? అన్న అంశాలపై ప్రభుత్వం సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ అంకితబావంతో పనిచేయాలని, లైన్‌మెన్ ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు 24 గంటలు అంతరాయం లేని విద్యుత్తును అందించి ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచాలని సీఎండీ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ ఆఫీస్ డైరెక్టర్ టెక్నికల్ గురువయ్య, ఈఈ, డీఈఈ, ఏఈఈ, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు





కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

● శ్రామిక మహిళా రాష్ట్ర నాయకురాలు నిర్మల


మాట్లాడుతున్న నిర్మల

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మెప్మా ఆర్పీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని శ్రామిక మహిళా రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. గురువారం కేకే భవన్‌లో మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం మూడో నగర మహాసభ ఎస్.శ్యామల అధ్యక్షతన జరిగింది. నిర్మల మాట్లాడుతూ ఆర్పీలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని, పెరుగుతున్న పని భారాన్ని తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, నాయకులు సీహెచ్ సాయిబాబా, షబానా, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి: సీపీఐ


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణన చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం సీఆర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన తరగతులకు సంబంధించి 143 కులాలు ఉన్నాయని, వారిని రాజ్యాధికారంలో భాగస్వాములు చేయడం లేదన్నారు. తెలంగాణ, కర్ణాటక, రాష్ట్రాల్లోని అసెంబ్లీల్లో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకుని కులగణన చేసి జనాభా ప్రతిపాదిక ప్రకారం స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని నిర్ణయించారని అన్నారు. మన రాష్ట్రంలో కూడా కులగణన చేసి జనాభా ప్రతిపాదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి రామ కృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు రామాంజనేయులు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

బొడ్రాయి కోసం విరాళం


కమిటీ సభ్యులకు చెక్కును అందజేస్తున్న మద్దిలేటి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పెద్దపాడు రోడ్డులోని ఇందిరాగాంధీ కాలనీ ఎల్లమ్మ ఆలయ సమీపంలో అక్టోబరు ఒకటిన బొడ్రాయి(నాభిశిలా) ప్రతిష్ఠకు పర్ల గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి యావదిన్నె మద్దిలేటి రూ.1.50 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బొడ్రాయి ప్రతిష్ఠ రోజున ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యావాహచనం, కంకణధారణ, కలశస్థాపన, యంత్రాభిషేకం, ఆదివాసాలు, హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రకాష్, రాము, రామకృష్ణ, చాంద్‌బాషా, లక్ష్మన్న, చిన్న, మద్దిలేటి పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

కార్పొరేషన్ కమిషనర్ విశ్వనాథ్


మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలో అనధికార లేఅవుట్లను ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా ప్రజలు క్రమబద్ధీకరించుకునేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో పట్టణ విభాగ అధికారులు, ప్లానింగ్, అమ్యూనిటీస్, వెల్ఫేర్ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో 150కి పైగా అనధికారి లేఅవుట్లు ఉన్నాయని, వాటన్నింటిని ప్రజలు క్రమబద్ధీకరించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందుగా ప్లానింగ్, అమ్యూనిటీస్, వెల్ఫేర్ కార్యదర్శులంతా కలిసి బృందంగా ఏర్పడి, ఆయా సచివాలయాల పరిధిలోని అనధికారిక లేఅవుట్లు, నిర్మాణాలను త్వరితగతిన గుర్తించాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ పథ కానికి ఇప్పటి వరకు 843 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ వెంకటరమణ, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాషా పాల్గొన్నారు.

● నగరాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దే లక్ష్యంతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా హరిత ఆంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు కమిషనర్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఇంటి మేడపై, అపార్టు మెంట్లు, బాల్కనీలలో మొక్కలు, పండ్లు, చెట్లు, కూరగాయలు పెంచే వారిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక బహుమతులు అందజేస్తున్నట్లు కమిషనర్ పేర్కొ న్నారు. ఆసక్తిగల వారు తమ వివరాలను సంబంధిత సచివాలయ పరిధిలోని పారిశుధ్య కార్యదర్శుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

● నగర పాలక కార్యాలయంలో స్తన్యపాన గది ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో గదులను ఆయన పరిశీలించారు. నగరపాలక కార్యాలయానికి వచ్చే మహిళలు తమ శిశువులకు పాలు పట్టించుకునే సౌకర్యం లభించక ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారన్న విషయం నగరపాలక దృష్టికి రావడంతో ప్రత్యే కంగా స్తన్యపాన గది ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయన వెంట మేనేజర్ చిన్నరాముడు, డీఈఈ గిరిరాజు, ఏఈ ఖాసిం వలి ఉన్నారు.

ఏడాది అంతా మద్దతు ధర

ఆర్డీవో సందీప్ కుమార్


పంట నమోదును పరిశీలిస్తున్న ఆర్డీవో సందీప్ కుమార్

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉల్లికి మద్దతు ధర రూ.1200 ఏడాది అంతా ఉంటుందని ఆర్డీవో సందీప్ కుమార్ అన్నారు. గురువారం వర్కూరులో పంట నమోదు, పంట నష్టం అంచనాపై తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రైతు దాసప్ప పొలాన్ని సందర్శించారు. పంట పెట్టుబడి, దిగుబడి వివరాలు తెలుసుకున్నారు. కౌలు రైతు వెంకటేశ్ పొలంలో ఉల్లిపైరును పరిశీ లించారు. కనీసం 120 రోజుల తర్వాత కోత జరిపించాలని సూచిం చారు. బోరుబావుల కింద సాగు చేసిన ఉల్లి 80-90 రోజుల్లోగా కోత జరిపించాలని, లేకపోతే గడ్డ చీలికలు, కుళ్లు ఏర్పడుతుందని రైతులు ఆయనకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను రూ. 2 వేలకు పెంచితే నష్టాల నుంచి గట్టెక్కుతామని వివ రించారు. అనంతరం ఆర్డీవో కోడుమూరు వద్ద ఉల్లి ఆరబోసుకున్న రైతులతో మాట్లాడారు. వెంకటగిరిలో త్వరలో చేపట్టబోయే రీసర్వే సందర్భంగా ప్రభుత్వ భూములు, సరిహద్దులు గుర్తించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, మండల సర్వేయర్ ఈశ్వర్, ఆర్ఐ అశోక్, వీఆర్వోలు ఎల్లప్ప, పరమేష్, శ్రీనివాసులు, బీరప్ప పాల్గొన్నారు.

ఆ అధికారి మాకొద్దు

ఇన్‌చార్జి ఎస్ఈకి మొరపెట్టుకున్న కార్మికులు


ఇన్‌చార్జి ఎస్ఈకి సమస్య విన్నవిస్తున్న కార్మికులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): హార్టికల్చర్ కార్యాలయంలో ఆ అధికారి పర్యవేక్షణలో పనిచేయాలంటే కార్మికులకు పడదు. దీంతో ఆ అధికారి మాకొద్దు అంటూ గురువారం ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి నగర పాలక కార్యాలయంలో కలిసి తమ సమస్యలు విన్నవించారు. హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) విజయలక్ష్మి తమను వేధింపులకు గురిచేస్తుందని నగరపాలక సంస్థ పరిధిలోని పార్కుల్లో పనిచేస్తున్న కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. ఏడీ ఉంటే తాము పనులను బహిష్కరిస్తామని కరాఖండిగా తేల్చిచెప్పారు. విధులకు హాజరైనా కూడా హాజరుపట్టికలో గైర్హాజరు వేస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఎవరికైనా పని చేసే సమయంలో దెబ్బ తగిలి ఇబ్బంది పడు తుంటే ఆ విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్తే తనకు ఏమి సంబంధం లేదని, పని మాత్రమే పూర్తి చేయాలని చెబుతుందని అన్నారు. ఈవిషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఎస్ఈ హామీ ఇచ్చారు.

పెన్ డౌన్‌కు రైటర్లు సిద్ధం


సబ్ రిజిస్ట్రార్‌కు వినతిప్రతం ఇస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

కోడుమూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్‌కు సిద్ధమయ్యారు. గురువారం కోడుమూరు సబ్ రిజిస్ట్రార్ తేజోవతికు వినతి పత్రాన్ని అందజేశారు. డాక్యు మెంట్ రైటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభు త్వం ఇటీవల ప్రవేశ పెట్టిన 2.0 విధానంతో చాలా సమస్యలు తలెత్తుతాయని, ఈ విధానం మంచిదైనప్పటికీ ప్రజలు, సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగులు, డాక్యుమెంట్ రైటర్లకు ఇబ్బందిగా ఉందన్నారు. పీడీఈ విధానంలో కొన్ని లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. 2.0లోపాలను గుర్తించాలని ఈనెల 19 నుంచి 20 వరకు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. డాక్యుమెంట్ రైటర్లు కిరణ్, రాజశేఖర్, నాగ రాజు, నరసింహా, అఖిల్, రమేష్, సురేష్, షఫి, అబ్దుల్లా పాల్గొన్నారు.

ఘనంగా కోట్ల సూర్య జన్మదిన వేడుకలు


కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గూడూరులో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలు టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. గురువారం గూడూరులో కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కోట్ల జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అలాగే నగర పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. చరణ్ కుమార్ మాట్లా డుతూ నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం కోట్ల సూర్య అని కొనియాడారు. కార్యక్రమంలో తిరుమల్ రెడ్డి, చెట్టుకింది సురేష్, సంగాల మధు, చెట్టుకింది నారాయణ, అయ్యలవారి నాయుడు, మూలగేరి లక్ష్మన్న పాల్గొన్నారు.

'బలిజ' అన్న పదం తొలగించాలి


మాట్లాడుతున్న ఆర్జా రామకృష్ణ

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 'దొమ్మర కులస్థుల ఆత్మగౌరవ పరిరక్షణలో భాగంగా ఆ కులం పేరును 'గిరి బలిజ' అని నామకరణం చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు, నగర బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, సంఘం గౌరవ సలహాదారు విజయభాస్కర్‌లు అన్నారు. గురువారం నగరంలోని ఐదురోడ్ల కూడలిలోగల నగర బలిజ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దొమ్మరి కులస్థులను వారి కులం పేరుతో అవమానించేలా పిలుస్తున్నారని, వారి కులం పేరును మారుస్తూ జీవో నెం.5 ద్వారా వారి కులాన్ని 'గిరి బలిజ' అని గుర్తించినట్లు ప్రకటించడం వల్ల బలిజ కులస్థుల మనోభావాలు దెబ్బతింటున్నాయని అన్నారు. ఈశ్వర్‌కుమార్, శైలేష్ భాను, ప్రభాకర్‌రెడ్డి, ప్రకాశ్, శేషు పాల్గొన్నారు.

టెండర్లను అడ్డుకుంటాం: ఎస్వీ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు టెండర్లు వేస్తే అడ్డుకుంటామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఆరోగ్యశ్రీ నిధులను నిలిపివేసి, దానిని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. 19న ఆదోని మెడి కల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, సోంపల్లి కృష్ణకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

ఉపాధి పనుల్లో క్షేత్ర సహాయకులే కీలకం


మాట్లాడుతున్న ఏపీడీ పద్మావతి

కర్నూలు రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పనుల్లో క్షేత్ర సహాయకులదే కీలకమని డ్వామా ఏపీడీ పద్మావతి అన్నారు. కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో గురువారం ఎన్ ఆర్‌ఈజీఎస్ క్షేత్ర సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈకార్యక్రమానికి డ్వామా ఏపీడీలు పద్మావతి, కృష్ణమోహన్ పాల్గొని క్షేత్ర సహాయకులనుద్దేశించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే కార్యక్రమాల గురించి, క్షేత్ర సహాయకుల చేయాల్సిన విధివిధానాలను వివరించారు. కార్యక్ర మంలో మధుబాబు, మద్దేశ్వరయ్య, పృధ్వీరాజ్, మధు, వెంకటకృష్ణతోపాటు పలు మండలాల క్షేత్ర సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయం

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం అభినందనీయమని క్లస్టర్ ఇన్‌చార్జి ఉపకులపతి వి.వెంకట బసవరావు అన్నారు. గురువారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో రిజిస్ట్రార్ జి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. రిజిస్ట్రార్ శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో జాతీయ స్థాయిలో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల కోసం 5వేల డిగ్రీ కళా శాలలు పాల్గొన గా అందులో సిల్వర్ జూబ్లీ కళాశాల నుంచి 200 నుంచి 300 మధ్య ర్యాంకుల్లో ప్రతిభ కనబరచడం హర్షించదగ్గ విషమన్నారు. ఈసందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులు టి.కార్తిక్, హిమబిందు, డి.మనిషాలను ఆయన అభినందించారు.

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టు అన్యాయం

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆదోని మెడి కల్ కాలేజీ ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వమే నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల నాయకులు శాంతి యుతంగా నిరసన తెలిపితే.. వారిని పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీలను ప్రైవేటు, పబ్లిక్ పార్టనర్‌షిప్ పేరుతో మెడికల్ కాలేజీని ప్రైవేటుకు అప్పజెప్పేందుకు పూనుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ పాఠశాలలో డీఎస్సీ ద్వారా నియామకాలను చేపట్టాలని బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు కే.సతీష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎయిడెడ్ పాఠశాలలో తప్పుడు మార్గాల్లో మామూళ్లు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. గత మూడేళ్లలో చేపట్టిన నియామకాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ ద్వారా మాత్రమే అర్హతలు కలిగిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి.బెళగల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనదొడ్డి గ్రామానికి జల్‌జీవన్ మిషన్ కింద మంజూరైన తాగు నీటి పథకాలను ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ గోసెనాయక్ గురువారం పరిశీలించారు. అనంతరం గుండ్రేవుల, కొండాపురం గ్రామాల్లోని తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మన దొడ్డి గ్రామానికి తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

దోమల నివారణకు చర్యలు

గూడూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. గురువారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించామన్నారు. ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. శానిటేషన్ హెల్త్ అసిస్టెంట్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

సి.బెళగల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం రమేష్ అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళల తో ఆయన సమావేశం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే పథకాలను పొదుపు మహిళా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరా రు.

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న సర్దార్ భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకని ఈనెల 27న నిర్వహించే రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిటీష్ పాలకుల నుంచి మాతృభూమి విముక్తి కోసం 23 ఏళ్ల వయసుకే ప్రాణాలు అర్పించిన విప్లవ యువ కిశోరం సర్దార్ భగత్ సింగ్ అన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి ఎం.బీసన్న, ఆర్గనై జింగ్ కార్యదర్శి కృష్ణ, నాయకులు చంటి, అఖిల్, మధు, శివ పాల్గొన్నారు.

నిధులు మంజూరు

సి.బెళగల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్ ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.3కోట్ల నిధులు మంజూరైనట్లు ఆర్ అండ్‌బీ డీఈ రమణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన సి.బెళగల్ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి కంబంధహల్ వరకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, త్వరలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు.

జీవనశైలి మార్పులతోనే వ్యాధులు

కర్నూలు హస్పిటల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవనశైలి మార్పులతోనే బీపీ, మధుమేహం, గుండె, పక్షవాతం వంటి దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయని జిల్లా అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ హెచ్చరించారు. నగరంలోని బాబా బృందావన్ నగర్‌లో జరుగుతున్న ఎన్‌సీడీ-4 సర్వేను ఆయన పరిశీలించారు. నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లను ముందస్తుగా గుర్తించి కర్నూలు స్టేట్ క్యాన్సర్ హస్పిటల్‌కు పంపించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఆరోగ్య కార్యకర్త వెన్నెల, ప్రాజెక్టనిస్టు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం


పుసులూరులో పర్యటిస్తున్న డీఎల్‌డీవో రమణారెడ్డి

కల్లూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు డీఎల్‌డీవో జి.రమణారెడ్డి అన్నారు. గురువారం కల్లూరు మండలం పుసులూరులో ఆయన ఎంపీడీఓ నాగేశ్వరాచలరెడ్డితో కలిసి పర్యటించి ఐవీఆర్ఎస్ కాల్స్ ఫీవర్ సర్వేను పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. క్లోరినేషన్ అనంతరం ప్రజలకు నీరు సరఫరా చేయాలని, గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణలో అలసత్వం వద్దని సిబ్బందిని ఆదేశించారు. సర్పంచు రాముడు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉల్లి, టమోటా రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని మానవ హక్కుల కమిషన్ అసోసియేషన్ చైర్మన్ దేవరశెట్టి పరమేశ్వరయ్య డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో సామాజిక కార్యకర్త మీసాల సుమలత ఆధ్వర్యంలో ఏర్పాటు ఉచిత ఉల్లిగడ్డలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పేదలకు పంపిణీ చేశారు. పరమేశ్వరయ్య మా ట్లాడుతూ ప్రకృతి వైపరీత్యంతో ఉల్లిపంట నష్టపోయిన వారు సచివాల యాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఈ ఏడాది వర్షాలు ముందే రావడంతో కొన్నిచోట్ల సాగుకు ఆ వర్షాలు ఉపయోగపడినా, మరి కొన్ని చోట్ల వరి, మొక్కజొన్న, ఇతర పంటలకు తీవ్ర నష్టం కలిగించాయని అన్నారు.

ఆదోనిని జిల్లా చేయాలి

● అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే పార్థసారథి



ఆదోని, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదోనిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి, పట్టణాన్ని నాలుగు మండలాలుగా విభజించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడుతూ 2.5లక్షల జనాభా ఉండటంతో ప సమస్యలు ఎక్కువవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే పట్టణంలో ఇంత జనాభాకు పరిపాలన కష్టమని, ప్రభుత్వ సేవలు పొందడంలో పజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విన్నవించారు.

జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదోనిని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి క్రాంతినాయుడు కోరారు. గురువారం ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు ప్రణాళికల నేపథ్యంలో సీఎస్‌కు వినతి ప్రతిపాదనలు పాలని అధికారులను కోరామన్నారు. ప్రస్తుత జిల్లా కేంద్రం కర్నూలు వంద కి.మీ. దూరం ఉందని, ఆదోని జిల్లా కేంద్రమైతే కేవలం 30, 40 కి.మీ. దూరం ఉంటుందన్నారు.

21న డాడ్జ్‌బాల్ జుట్టు ఎంపిక

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అండర్-19 జూనియర్ నేషనల్ డాడ్జ్ బాల్ పోటీలకు ఈనెల 21 న మున్సిపల్ పాఠశాల ఆవరణలో ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి షాబీర్ బాషా తెలిపారు. గురువారం మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ నగరంలో రాష్ట్ర జట్టుకు పాల్గొంటుదన్నారు. ఆసక్తి కలిగిన బాలురు వివరాలకు 7013563203 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భక్తులకు అన్నదానం

హొళగుంద, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లర్తి శేక్షావలి, షాషావలి ఉరుసుకు వచ్చే భక్తులకు గురువారం అన్నదానం చేస్తున్నట్లు టీడీపీ నాయకులు, ఈడిగ గోవింద్ గౌడ్, రాజేంద్ర గౌడ్ తెలిపారు. గురువారం అన్నదానాన్ని ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తారని మూడు రోజుల పాటు నిత్యాన్నదానం చేస్తామన్నారు. ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ గురజాల దిలీప్ కుమార్, కన్వీనర్ వీరన్న గౌడ్, దుర్గయ్య, బీజే పంపాపతి, మొయిన్ పాల్గొన్నారు.



అన్నం వడ్డిస్తున్న దాత, సీఐ,ఎస్ఐ

టీబీ నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదోని సర్వజన ఆసుపత్రి వైద్యుడు సుధాకర్ పేర్కొన్నారు. గురువారం ఏపీఎన్‌జీవో భవనంలో ఆ సంఘం అధ్యక్షురాలు ఉషారాణి అధ్యక్షతన జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. క్షయ మనిషిని బలహీన పరుస్తుందని, సంపూర్ణ అవగాహనతో విముక్తి పొందవచ్చు అన్నారు. ఊపిరితిత్తులు చెడిపోయి ఆయాసం, దగ్గు, జ్వరం, బరువు తగ్గి రోగనిరోధక శక్తి క్షీణిస్తుందన్నారు. వ్యాధి ముదరక ముందే పరీక్షలు చేయించుకొని ఆరు నెలలపాటు ఉచితంగా ప్రభుత్వం ఇచ్చే మందులు వాడి, పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం ఏపీఎన్‌జీవో నాయకులు కొంతమంది క్షయ బాధతులకు పోషకాహార కిట్లను అందించారు. డాక్టర్ శేకన్ భాను, ఎన్‌జీవో కార్యదర్శి బజారి, మంజునాథ్ లక్ష్మీ, వెంకటేశ్వర్లు, మల్లికార్జున న్యాయవాది నాగేంద్ర, గౌస్ పీరా ఉన్నారు.

కూలీలు ఈకేవైసీ చేసుకోవాలి

తుగ్గలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు ఈకేవైసీ చేసుకోవాలని ఎంపీడీవో విశ్వమోహన్ కోరారు. గురువారం కార్యాలయంలో మాట్లాడుతూ ఉపాధి పథకంలో ప్రభుత్వం నూతన నిబంధనలు తీసుకు వచ్చిందన్నారు. ఈకేవైసీ చేయించుకోకుంటే పనులు కల్పించమని అన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెస్తాం

మద్దికెర, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరూపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెస్తామని డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి తెలపారు. గురువారం స్థానిక చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల గ్రామాల్లో చెత్త కనిపంచకుండా పని చేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సంపద కేంద్రాల్లో వేసి సంపద సృష్టించాలన్నారు. కార్యదర్శి శివకుమార్ ఉన్నారు.

చెక్‌డ్యాం ధ్వంసం.. నీట మునిగిన పొలాలు

● పంటలు దెబ్బతింటున్నాయని రైతుల ఆవేదన
● పరిశీలించిన తహసీల్దార్ గుండాల్ నాయక్



మద్దికెర: నీట మునిగిన పత్తి పొలంలో రైతు బీసన్న

మద్దికెర సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారు యజ్ఞం చెరువు సమీపంలోని చెక్‌డ్యాంను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో పొలాలు నీట మునుగుతున్నాయని రైతులు రామకృష్ణ, తిమ్మప్ప, సుధాకర్ వాపోయారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువు పూర్తిగా నిండిందని, కొందరు దుండగులు గట్టును పగులకొట్టారన్నారు. పొలాల్లో అడుగులోతు నీరు నిలిచి పంటలు దెబ్బతింటనాన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ గూండాల్ నాయక్‌కు వినతి పత్రం అందజేయగా సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.



ధ్వంసమైన చెక్‌డ్యాం

టమోటా



ఆస్పరి మండలం బిల్లేకల్, ఆస్పరి మార్కెట్లలో టమోటా ధరలు అమాంతం పడిపోయాయి. 20 కేజీల బాక్సు జత రూ.250ల నుంచి రూ.350ల లోపే పలుకుతోందని, కిలో రూ.5ల నుంచి రూ.8లకు మించి ధర రావడం లేదని తాము తీవ్రంగా నష్టపోయాని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 900 ఎకరాల్లో టమాటా పంటను సాగుచేశారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నాణ్యత తగ్గడం కూడా ధర పడిపోవడానికి కారణంగా తెలుస్తోంది. మార్కెటింగ్ అధికారులు స్పందించి గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. - ఆస్పరి

వేగంగా వైద్య కళాశాల పనులు

● కళాశాలను సందర్శించిన కూటమి నాయకులు



పునాదుల్లో మోకాళ్లలోతు నీటిలో నిరసన తెలుపుతున్న నాయకులు

ఆదోని, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని ఆరేకల్ వద్ద ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ పనులు ఊపందుకున్నాయని కూటమి నాయకులు తెలిపారు. గురువారం కళాశాలను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. గత ప్రభుత్వ హాయంలో వేసిన పునాదుల్లో నిలిచిన మోకాళ్ల లోతు నీటిలో నిరసన తెలిపారు. అనంతరం టీడీపీ నాయకుడు భూపాల్‌చౌదరి మాట్లాడుతూ ప్రజలపై భారం మోపకుండా పీపీపీ పద్ధతిలో నిర్మించి, పేద విద్యార్థులకే అధిక సీట్లు కేటాయిస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు ఆగిపోయాయని, కూటమి ప్రభుత్వం బాధ్యతగా మళ్లీ ప్రాంభించిందన్నారు. రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే తమ లక్ష్యమని, వైసీపీ నాయకులు రాజకీయ ప్రయోజనానికే ప్రైవేటీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చారన్నారు. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రూ.5 వేల కోట్లకు రుణం తీసుకుని పనులు చేయలేదన్నారు. బీజేపీ నాయకుడు విట్టా రమేష్ మాట్లాడుతూ పనులు 20 శాతం మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. మారుతినాయుడు, వెంకటేష్‌చౌదరి, తిమ్మప్ప, బసాపురం రామస్వామి, ప్రతాపరెడ్డి, సాధికాబేగం పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

మద్దికెర, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి సూచించారు. గురువారం ప్రభుత్వ వైద్యశాలలో సమావేశం నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు, క్రమం తప్పక వైద్యపరీక్షలు చేయించుకోవాల న్నారు. ప్రతి గురువారం ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తామని, ప్రసవానికి ప్రభుత్వ వైద్యశాలకే రావాలన్నారు. నిరంజన్ బాబు, అక్బర్ బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీలక్ష్మి

జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే

ఆలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి కలిశారు. గురువారం రాత్రి తాడేపల్లిలోని జగన్ నివాసంలో చర్చించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజల పక్షాన నిలవాలని, జగన్ మోహన్‌రెడ్డి సూచించినట్లు జగన్ సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



జగన్‌తో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి

ఆదోని రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని డీపీవో భాస్కర్ ఆదేశించారు. స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా, డీఎల్‌పీవో తిమ్మక్క, ఎంపీడీవో జనార్దన్‌తో కలిసి ఆయన ఆదోని మండలం చాగి గ్రామాన్ని సందర్శించి ఇంటి కొలతలను పరిశీలించారు. అనంతరం మండల కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో భాస్కర్

కోర్టు భవన నిర్మాణానికి కృషి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతన కోర్టు భవన నిర్మాణానికి కృషి చేస్తామని జిల్లా న్యాయాధికారి కబర్ది పేర్కొన్నారు. గురువారం మన్రోబావి వెనక ఉన్న స్థలాన్ని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ లీలా వెంకటప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం సబ్‌జైలును తనిఖీ చేశారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ఆర్డీవో భరత్‌నాయక్, పత్తికొండ న్యాయాధికారి జ్యోత్స్నదేవితో సమావేశమయ్యారు. తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మధుబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి కబర్ది

నేడు 'మండల గ్రీవెన్స్'

వెల్దుర్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర వర్మ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ నవ్య అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కూలీలకు ఫేస్‌యాప్

దేవనకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు ఫేస్‌యాప్ తప్పనిసరని ఏపీవో రాజునాయక్ అన్నారు. గురువారం మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న కూలీలంతో ఆధార్‌తో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆధార్ కార్డుతో సంప్రదిస్తే ఈకేవైసీ చేస్తారని, ఇది బోగస్ మాస్టర్ల నివారణకు ఉపయోగపడుతుందన్నారు.

ఉల్లి, టమోటాకు గిట్టుబాటు ధర ఎక్కడ?



మాట్లాడుతున్న లక్ష్మీదేవి

తుగ్గలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉల్లి, టమోటా పంటలకు గిట్టుబాటు ధర ఎక్కడ అని పత్తికొండ మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నగేష్ ప్రశ్నించారు. గురువారం జి.ఎర్రగు డిలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉల్లికి ధర లేక రైతులు మార్కెట్‌లోనే పడేస్తున్నారన్నారు. రూ.20వేలు ఇస్తామని చెప్పి కేవలం రూ.7వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ప్రభుత్వం రైతులను ఆదుకుని గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు.

పనుల నాణ్యత పరిశీలన

ఆదోని టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్ స్థలంలో ఆగిపోయిన మెగా కాంప్లెక్స్ పనులను తిరిగి ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. పునాదులలో వేసిన ఇనుప కడ్డీల సామర్థ్యాన్ని పరిశీలించడానికి కేడీఎం కన్సల్టెన్సీ (వైజాగ్) నిపుణులు వచ్చారు. నిర్మాణాన్ని పరిశీలించి, శాంపిల్ కడ్డీలను తీసుకెళ్లినట్లు మున్సిపల్ ఇంజనీర్ సత్యనారాయణ గురువారం తెలిపారు. నివేదికను జేఎన్‌టీయూ (అనంతపూర్)కు పంపి, వారి సూచనల మేరకు పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

ఈ-క్రాప్ తప్పనిసరి

మద్దికెర, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిని ఏవో రవి అన్నారు. గురువారం మద్దికెర, బురుజుల గ్రామాల్లో పంట నమోదును పరిశీలించారు. నమోదు చేసుకుంటేనే పంటలు దెబ్బతింటే ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం వర్తిస్తుందన్నారు.

వేరుశనగ ధర పతనం

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో వేరుశనగ ధరలు గురువారం భారీగా పతనమయ్యాయి. క్వింటా గరిష్ఠంగా రూ.4,568 ధర పడిపోయింది. ఒక్క రోజులోనే క్వింటాకు రూ.2,300 ధర తగ్గింది. ఖరీఫ్ ఆరంభంలోనే ధరలు తగ్గడంపై దిగులు చెందుతున్నారు. తేమతో విక్రయానికి తీసుకురావడం వల్లే ధర తగ్గిందని వ్యాపారులు పేర్కొన్నారు. 974 బస్తాలను రైతులు విక్రయానికి తీసుకురాగా వాటి కనిష్ఠ ధర రూ.3,089, గరిష్ఠ ధర రూ.4,568, సగటున రూ.4,093 పలికింది.

స్వర్ణామృతం పంపిణీ

ఆదోని టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అభయాంజనేయ ఆలయం ఆవరణలో ఆవోపా ఆధ్వర్యంలో గురువారం చిన్నారులకు స్వర్ణామృతం ఔషధం పంపిణీ చేశారు. వికాస తరంగిణి సహకారంతో కాకుబాల్ నాగేష్ సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించారు. ఆవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ 16వ విడతగా 213 మంది చిన్నారులకు అందజేశామన్నారు. కార్యదర్శి రఘు, కోశాధికారి యాదగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు వెంకటేష్ బాబు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రవి, ఏవో సురేష్

ఉల్లి రైతులు అధైర్యపడొద్దు

తుగ్గలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులు అధైర్య పడొద్దని గిట్టుబాటు ధర వస్తుందని, తహసీల్దార్ రవి, ఏవో సురేష్ అన్నారు. గురువారం తుగ్గలిలో ఉల్లి పొలాలను పరిశీలించారు. పంట కోతకు నెల ఉందని, అప్పటిలోగా గిట్టుబాటు ధర వస్తుందన్నారు. ఉల్లి రైతులు పంట నమోదుతో పాటు బ్యాంకు అకౌంట్లు, ఆధార్ కార్డులు వ్యవసాయాధికారులకు ఇవ్వాలన్నారు. పంట చేతికి రాకముందే కోతలు కోసి ఇబ్బందులు పడవద్దన్నారు. హార్టికల్చర్ ఏవో సునీల్, ఏఈవోలు లక్ష్మినారాయణ, మల్లేష్, నారాయణ, సూర్యప్రకాష్ రెడ్డి, స్రవంతి వీఆర్వో నవీన్ పటేల్ ఉన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఆదోని టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలమని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'స్వచ్ఛతా హి సేవ'లో భాగంగా గురువారం పట్టణంలోని తిక్కస్వామి దర్గా ఎదురుగా ఉన్న మునిసిపాలిటీ స్థలాన్ని శుభ్రం చేయించారు. ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా సిబ్బందికి అందించి సహకరించాలని సూచించారు.

కూలిన మిద్దె

వెల్దుర్తి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 1వ వార్డుకు చెందిన కుమ్మరి పరుశురాముడుకు చెందిన మట్టిమిద్దె గురువారం కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బాధితుడి కథనం మేరకు.. వర్షాల ప్రభావంతో మిద్దె కూలిపోయిందని, ఇంట్లోని బియ్యం, వంట సామగ్రి పాడైంది. భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కోడళ్లు ఇదే ఇంట్లో ఉంటున్నారు. తాను ఆశ్రయం కోల్పోయానని ప్రభుత్వం దుకోవాలని బాధితుడు కోరారు.



వెల్దుర్తిలో కూలిన మట్టి మిద్దె



విద్యార్థులతో మాట్లాడుతున్న పరిశీలకుడు

హాస్టల్ తనిఖీ

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనాథ విద్యార్థుల హాస్టల్‌ను గురువారం రాష్ట్ర పరిశీలకుడు రమేష్ కుమార్, జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాల సమన్వయ కర్త సురేంద్ర బాపూజీ తనిఖీ చేశారు. రాజరాజేశ్వరి నగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసియ విద్యాలయం హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. హాస్టల్ ఆవరణలో పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థులకు తాజా కూరగాయలు, పౌష్టికరమైనా ఆహారాన్ని అందించేందుకు ఆవరణంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల చదువులు, వసతి, ఆహారం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించమని హెచ్చరించారు. కేర్ టేకర్ వరప్రసాద్, శ్రీనివాస్, అనిత పార్వతి పాల్గొన్నారు.

పొలాల్లో నీరు ఉండకుండా చూడాలి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● ఆదోని వ్యవసాయాధికారి సుధాకర్



ఆదోని రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఏవో సుధాకర్ తెలిపారు.

ప్రశ్న: అధిక వర్షాలనుంచి పంటలను ఎలా రక్షించుకోవాలి

జవాబు: నీటిని కాల్వల ద్వారా బయటకు మళ్లించాలి. 19:19:19 లేదా మల్టికే (13045)ను లీటరు నీటికి 108 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

ప్రశ్న: యూరియా కొరత వాస్తవమేనా?

జవాబు : ఏప్రిల్ 1 నుంచి నేటి వరకు రైతు సేవా కేంద్రాల ద్వారా వెయ్యి మెట్రిక్ టన్నులు, డీసీఎంఎస్ ద్వారా 650 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశాం. రైతులకు యూరియ కొరత లేదు.

ప్రశ్న: దిగుబడి రావాలంటే ఏం చేయాలి?

జవాబు: సమగ్ర భూ యజమాన్య పద్ధతులతోపాటు సస్యరక్షణ చర్యలు తీసుకుని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి.

ప్రశ్న: భూ సారం రక్షణకు ఏవిధమైన చర్యలు తీసుకోవాలి?

జవాబు: 50 శాతం రసాయనిక ఎరువులు వేయాలి, 50శాతం వర్మి కంపోస్టు, కంపోస్టు, పశువుల, జీవన ఎరువు ఉపయోగించాలి.

ప్రశ్న: రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడితే అనర్థాలున్నాయా?

జవాబు: రసాయనిక ఎరువులు అధికంగా వాడితే భూసారం తగ్గి, నెర్రెలు బారుతుంది.

ప్రశ్న: మండలంలో సాగు భూమి విస్తీర్ణమెంత?

జవాబు: 32,023 హెక్టార్ల సాగు భూమి ఉంది. ఖరీఫ్‌లో 29,416హెక్టార్లలో సాగు చేశారు. పత్తి 22,826, వరి 928, మిరప 1,665, వేరుశనగ 1,010 హెక్టార్లలో సాగు చేశారు.

ప్రశ్న: ప్రైవేటు డీలర్లు యూరియాను అధిక రేట్లకు అమ్ముతూ, లింకు మందులు అంటగడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి?

జవాబు: ప్రభుత్వం యూరియా బస్తా ధర రూ.266.50లుగా నిర్ణయించింది. ఇంతకుమించి అమ్మినా, లింకు మందులు అంటకట్టినా డీలర్లపై చర్యలు తీసుకుంటాం.

యువత ఉద్యమించాలి

ఆదోని టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదోని జిల్లా సాధనకు యువత ఉద్యమించాలని ఐక్యవేదిక కన్వీనర్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ పిలుపు నిచ్చారు. గురువారం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఆదోని ఏళ్లగా నిర్లక్ష్యానికి గురై అభివృద్ధి చెందలేదన్నారు. ఆదోని డివిజన్ అభివృద్ధి చెందాలంటే జిల్లా ఏర్పాటుతోనే సాధ్యమన్నారు. నిధులు, సాగునీరు తేవడంలో నాయకులు నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. వ్యాపారం, వ్యవసాయం, విద్య, వైద్య సౌకర్యాలకు జిల్లా సాధనే మార్గమన్నారు. పీడీఎస్‌వో నాయకుడు తిరుమలేష్, జిల్లా సమితి నాయకులు నరేంద్ర యాదవ్, కుబేర స్వామి పాల్గొన్నారు

చేతులెత్తేసిన ప్రభుత్వం

ఆదోని టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారలో నిలిచిపోయిన వైద్య కళాశాలను పూర్తిచేసేందుకు చేతకాక రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్ విమర్శించారు. గురువారం మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా విమర్శలు చేసిన కూటమి నాయకులు ప్రస్తుతం అధికారంలో ఉండి కూడా మెడికల్ కళాశాలను ప్రైవేటుకు అప్పగించాలనుకోవడం సిగ్గుచేటన్నారు. వైద్య కళాశాల కార్పొరేట్ చేతిలో ఉంటే ప్రజలకు ఉచిత వైద్యం అందదన్నారు. విద్యార్థులు, ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వమే మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టాలని ఉద్యమిస్తామన్నారు. నాయకులు దిలీప్ ధోకా, మారుతీరావు, దేవిశెట్టి వీరేష్, శ్రీనిత్ రాయల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రమాదకర ప్రయాణం

● 20 రోజులుగా బస్సు సర్వీసులు నిలిపివేశారు
● ఆటోల్లో విద్యార్థుల ప్రయాణం



బస్ పాస్ చూపిస్తున్న విద్యార్థులు



ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు

కోసిగి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బస్సు పాసులు ఉన్నా 20 రోజులుగా బస్సు సర్వీసు రద్దు కావడంతో నాలుగు గ్రామాల విద్యార్థులు ఆటోల్లో ప్రమాదకరస్థాయిలో స్కూలుకు వెళ్తున్నారు. కోసిగి మండల పరిధిలోని దుద్ది, కోల్‌మాన్ పేట, తిప్పలదొడ్డి, కరిణి గ్రామాల విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం ఆదోని డిపోకు చెందిన కరిణి, తిప్పలదొడ్డి బస్సు సర్వీసులను 20 రోజుల నుంచి నిలిపివేయడంతో బస్సు పాసులు ఉండి కూడా డబ్బులు కట్టి ఆటోల్లో ప్రమాదకరంగా వెళ్తున్నామని తెలిపారు. ఆదోని డిపోకు చెందిన ఆర్టీసీ అదికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని, వర్షాకాలం కావడంతో రోజూ వర్షానికి తడుస్తూ ఆటోల్లో ప్రయాణాలు చేస్తున్నామని విద్యార్థులు వాపోతున్నారు. కోసిగిలోని వాల్మీకి సర్కిల్ నుంచి విద్యార్థులు ఆటోల టాప్‌లపై ఎక్కి ప్రమాదకరంగా కోల్‌మాన్‌పేట, తిప్పలదొడ్డి, కరిణి గ్రామాల విద్యార్థులు బస్సుల రాకపోవడంతో ఆటోల్లో వెళ్లరు. ఈ విషయాన్ని ఆదోని డిపో మేనేజర్ మహ్మద్ రఫీని వివరణ కోరగా.. బస్సులు వెళ్తాయో లేదో మాకు ఎలా తెలుస్తుందని అని డిపో మేనేజర్ సమాధానం ఇచ్చారు.

వర్షానికి తడుస్తూ ఆటోలో వెళ్తున్నాం



రోజూ ఆటో టాప్‌పై ఎక్కి మా ఊళ్లకు వెళ్తున్నాము. మా ఊరికి బస్సు ఉన్నా కూడా చాలా రోజుల నుంచి బస్సు రావడం లేదు. రోజూ రూ.20లు పెట్టి బదులకు ఆటోలో వస్తున్నాం. ఏదీ ఏమైనా బస్సులు పెట్టాలి..

సురేశ్, 6వ తరగతి విద్యార్థి, తిప్పలదొడ్డి

20 రోజులుగా బస్సు రావడం లేదు



మాకు బస్సు పాస్ ఉన్నా ఆదోని డిపో చెందిన తిప్పలదొడ్డి బస్సు సర్వీసు రావడం లేదు. ఆటోలోనే వెళ్తున్నాము. రోజూ రూ.20లు ఆటోల చార్జీలు అవుతున్నాయి. అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. మా ఊరికి బస్సులు వచ్చేలా చూడాలి.

● రమ్య, 8వ తరగతి విద్యార్థిని, కోల్‌మాన్ పేట

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ భార్గవి

కౌతాళం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కౌతాళం పోలీస్ స్టేషన్‌ను గురువారం ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్‌లోని రికార్డులను సీఐ అశోక్ కుమార్‌తో తెప్పించుకుని స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే స్టేషన్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు.డీఎస్పీ వెంట కౌతాళం సీఐ అశోక్ కుమార్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మంత్రాలయం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి ఏపీ మోడల్‌స్కూల్‌లో కర్నూల్ కంటి ఆసుపత్రి (జీజీహెచ్) వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులందరికి కంటి పరీక్షలు చేశారు. దృష్టిలోపం గల విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేస్తామని డీ. ప్రతాప్ (డీఓఏ) పీ. శ్రీనివాసులు(పీఎంఓ) తెలియజేశారు.

12వ పీఆర్సీ వేతనాలు ఇవ్వాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కాంట్రాక్ట వర్కర్స్‌కు 12వ పీఆర్సీ వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఇస్మాయిల్ సీఐటీయూ మండల అధ్యక్షుడు రాముడు డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

PUBLIC NOTICE

Under the instructions of my client, **M/s HINDUSTAN PETROLEUM CORPORATION LIMITED** (A Govt. of India Enterprise) represented by its Senior Regional Manager, Peddapalli Village, Bhakrapeta, Siddavatam Mandal, Y.S.R. Kadapa District, A.P., Pin: 516247, I Issue this Public Notice as follows.

That my client Corporation proposes to take on lease the scheduled land owned by Sri. Bugude Pakkiranna Prabhakar, S/o. Sri Bugude Pakkiranna and Yerramolla Dharmesh, S/o. Uppara Lakshmanna. Therefore, it is hereby called upon the public that if any person (s) having a better claim of right, title, possession or interest etc. than Sri Bugude Pakkiranna Prabhakar and Sri. Yerramolla Dharmesh over the schedule land, should submit his/her written objection(s) along with supporting documents to the undersigned within 30 days from the date of publication and if no objection is received within stipulated period, my client-Corporation would construe that there were no objections and would take the scheduled land on lease and that Corporation will not entertain any further objections(s).

SCHEDULE PROPERTY

All that is a land admeasuring an extent of 686.87 sq.mtrs in Sy.No.697A (LPM No.6637) situated in H.Muravani Village, Peddakadabur Mandal, Kurnool District,. A.P., **Boundaries : East** : 24 feet wide Road, **South** : R and B Road, **West** : Others Land, **North** : Middle portion of Plot sold to B.Annapurna & U.Chandravathi.

D.SRINIVASULU, Advocate
52/79, Fort, Kurnool-518 001.
Cell: 98491 09654.

తీరనున్న తాగునీటి సమస్య

గోనెగండ్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ చొరవతో గ్రామాలలో తాగునీటి పథకం సంబంధించిన జలజీవన్ మిషన్ పనులు వేగంగా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి గోనెగండ్ల గ్రామాలలో జరుగుతున్న జలజీవన్ మిషన్ పనులను పరిశీలించారు.

ఉల్లిని గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తీసుకురావాలి

● కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ నవ్య



ఉల్లి కొనుగోలును ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): పక్వానికి వచ్చిన ఉల్లిని గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు విక్రయానికి తీసుకురావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి. నవ్య అన్నారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఉల్లి విక్రయాలను జేసీ బి. నవ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్, మార్కెటింగ్ శాఖ జేడీ, మార్క్‌ఫెడ్, సబ్ కలెక్టర్‌తో కలిసి అమ్మకానికి రైతులు తెచ్చిన ఉల్లిని పరిశీలించారు. గ్రేడింగ్ చేయకుండా తీసుకురావటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.' గ్రేడింగ్ చేయాలి కదా ఇలా ఉంటే ఎలా.. కొనుగోలు చేసిన ఉల్లిని చాలా దూరం పంపాల్సి ఉంది.. ఇలా ఉంటే ఎలా పంపేది' అని రైతులను ప్రశ్నించారు. ఇందుకు ఓ రైతు స్పందిస్తు వర్షం ఏకదాటిగా వస్తుండటంతో ఆరబోసుకునే అవకాశం లేకుండా పోతోందని వివరించారు. అనంతరం ఇన్‌చార్జీ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ కర్నూలు మార్కెట్ యార్డులో స్టాక్ పాయింట్ ఉల్లి ఎక్కువగా ఉన్నందువల్ల రెండు రోజులు తాత్కాలికంగా ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు నిర్వహణ జరుగుతుందన్నారు. ఇప్పటివరకు మార్కెట్‌కు 18 మంది రైతులు 1500 క్వింటాళ్లకు పైగా ఉల్లిని తీసుకొచ్చారన్నారు. రైతులు పక్వానికి వచ్చిన ఉల్లిని మాత్రమే గ్రేడింగ్ చేసి తీసుకురావాలన్నారు. ఉల్లి పంట నాటిన నాటి నుంచి 110 రోజులకు పక్వానికి వస్తుందని అప్పుడు కోత కోయాలన్నారు. ముందుగానే పంటను కోత కోస్తే సరిగా ఉండకపోవటం వల్ల గిట్టు బాటు ధర సమస్య వస్తుందన్నారు. దీన్ని గమనించి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీడీ రామాంజనేయులు, మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ అంజి, ప్రత్యేకశ్రేణి కార్యదర్శి చంద్రమౌళి, పద్మజ,తహసీల్దార్ శేషఫణి, టీడీపీ నాయకులు మచాని మహే ష్, కమ్మ మహేంద్ర బాబు, డైరెక్టర్లు అబ్రహాం, దావీదు, జగదీష్ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

కౌతాళం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి వారికి భక్తులు గురువారం దేవాలయంలో చేపడుతున్న జీర్ణోద్ధారణ పనులకు కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం రాచమర్రి గ్రామ వాస్తవ్యులు శ్రీకాంత్ శెట్టి కుటుంబ సభ్యులు రూ.1,01,116ల నగదును, ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆలయ కార్యాలయం నందు అందజేసినట్లు తెలిపారు ఆలయ డిప్యూటీ కమీషనర్,ఈఓ వాణి తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మంత్రాలయం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటారని సూపర్‌వైజర్ సుమిత్ర అన్నారు. రచ్చుమర్రి అంగన్వాడీ సెంటర్‌లో గురువారం 8వ రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమాన్ని ఆధ్వర్యంలో న్విహంచారు. ఈకార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఢిల్లీలో ప్రారంభించారని ఆమె తెలిపారు. ఏఎన్‌ఎం శాంతికుమారి, ఎంఎల్‌హెచ్ శారద, వినోద్, అంజనమ్మ, మీనాక్షి పాల్గోన్నారు.

కౌతాళం:పిల్లలకు సమతుల్యమైన పోషకాల ఆహారాన్ని అందించి వారి ఎదుగుదలకు పాటుపడాలని అంగనవాడీ కార్యకర్త లక్ష్మినరసమ్మ తెలిపారు. కౌతాళంలో గురువారం పోషకాహార వారోత్సవాలలో భాగంగా అంగనవాడీ కేంద్రము నందు పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాలపై అవగాహన కల్పించారు.

పారిశుధ్యంపై దృష్టి

గోనెగండ్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన స్వచ్ఛ తాహి సేవతో గ్రామాల అభివృద్ధి సాధ్యం అని ఎంపీడీవో మణిమంజరి, డిప్యూటీ ఎంపీడీవో అనంత శయన, అన్నారు. గురు వారం ఎంపీడీవో సమావేశ భవనంలో ఎంపీడీవో మణిమంజరి మండలంలోని పంచాయతీ కార్యదర్శులో సమావేశం నిర్వహించారు. గోనెగండ్ల పంచాయతీ కార్యాలయంలో రోగులకు, పంచాయతీ కార్మికులకు ఉచితంగా ఆరోగ్యసిబ్బంది మందులను పంపిణీ చేశారు. మహిళలతో మాట్లాడి ఐవీఆర్ఎస్ కాల్స్ గురించి వివరించాలని తెలిపారు.

రజత గజవాహనంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : శ్రీ మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామి సజీవ సమాధి పొందిన గురువారం, ద్వాదశిని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే మూల బృందావనానికి పూజలు నిర్వహించారు.

కోర్టు భవనాల నిర్మాణానికి స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారి కబర్ధి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణానికి మంజూరైన అడిషనల్ కోర్టు భవనాల నిర్మాణం కోసం స్థలాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి గురువారం పరిశీలించారు. ఆదోని రోడ్డు టీబీపీ కాలనీలో ఉన్న డీఎస్పీ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీస్థలాన్ని పరిశీలించారు. డీఎస్పీ కార్యాలయం పక్కన ఉన్న స్థలాన్ని పరిశీలించిన జిల్లా జడ్జీ సంతృప్తిని వ్యక్యం చేసినట్లు ఎమ్మిగనూరు బార్ అసోషియోషన్ అధ్యక్షులు రషీద్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లీగల్‌సెల్ అథారిటి సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి, స్థానిక న్యాయవాదులు మురళీ కృష్ణ, రామకృష్ణ నాయుడు, లింగమూర్తి, ప్రసాద్, మల్లి కార్జునలు పాల్గొన్నారు.

120 రోజుల తర్వాతే ఉల్లి పంటను కోయాలి

గోనెగండ్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉల్లిపంటను సాగు చేసిన రైతులు సాగు చేసిన నాటి నుంచి 120 రోజుల పూర్తి అయిన తరువాతనే పంటను కోత కోయాలని జిల్లా ఉద్యానవనశాఖ సహాయ సంచాలకులు కృష్ణవర్ధన్‌రెడ్డి, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ కోరారు. గురువారం మండల పరిధిలోని నెరుడుప్పల, పిల్లిగుండ్ల గ్రామాలలోని ఉల్లి సాగు చేసిన పొలాలలో జిల్లా ఉద్యానవనశాఖ సహాయ సంచాలకులు కృష్ణవర్ధన్‌రెడ్డి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, తహసీల్దార్ రాజేశ్వరి, ఏవో హైమలత, సిబ్బంది పర్యటించారు. రైతులతో మాట్లాడారు. ఉల్లి సాగు చేసిన పంటపొలాలను, ఉల్లి పంటను కోసిన రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది నరసప్ప, పులిరాజు, అరుణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

మంత్రాలయం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహళ్లి గ్రామం వద్ద హైవే రోడ్డుకు ఉంచిన బారికేడ్లను రెండు స్కూటర్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈరోడ్డు ప్రమాదం గురువారం రాత్రి జరిగింది ఎమ్మిగనూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బోయ వెంకటకృష్ణుడు, బోయ గోవిందు అనే వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై మాధవరంలో బంధువులను పలకరించి సొంత గ్రామమైన వెంకటాపురానికి వెళ్తుండగా చెట్నహళ్లి గ్రామంలో హైవే రోడ్డుకు ఉంచిన బారికేడ్లకు ఢీకొట్టారు. దీంత వెంకటకృష్ణడు, గోవిందులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. మంత్రాలయం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వితంతువులు, వృద్ధులే టార్గెట్

మంత్రాలయం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామంలో వితంతువులు, వృద్ధులే లక్ష్యంగా కొత్త పించన్లు రూ.4వేలు ఇప్పిస్తామని నమ్మబలికి ఒక్కోరి దగ్గర రూ.500లు, రూ.700ల ప్రకారం వసూలు చేస్తున్నడు. గురువారం ఆదోని చెందిన జిలాన్ బాషా, ఆదోని పట్టణంలోని జామియా మసీదు, అజీద్‌నగర్ మార్కెట్ గల్లికి చెందిన జిలాన్ బాషా మద్యం మత్తులో తుంగభద్ర రైల్వేస్టేషన్ నుంచి మాధవరం వచ్చాడు. బీసీ కాలనీలో పించన్లు కొత్తవి రాస్తున్నానీ నమ్మబలికి అక్కడున్న వితంతువులు, వృద్ధులు నుంచి డబ్బులు వసూలు చేసుకుని మరోకాలనీకి వెళ్లాడు. మద్యం మత్తులో తూగుతున్న అతన్ని గుర్తించి కొందరు వివరాలు ఆరా తీశారు. వచ్చిన వ్యక్తి వద్ద ఫోన్ లేకపోవడం, కనీసం ఆదార్ కార్డు కూడా లేకపోవడం అనుమానం వచ్చి కాలనీవాసులు, టీడీపీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. బాధితులు సదురు వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దాదాపు 15 మంది వద్ద డబ్బులు వసూలు చేశాడనీ బాధితులు వాపోతున్నారు. నిందితుడు జిలాన్‌బాషా పోలీసుల అదుపులో ఉన్నాడు. సామాజిక సేవ చేస్తాననీ నమ్మబలుకుతూ ఆయా గ్రామాల్లో కూడా ఇలాంటి పనులకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు.

వాహనాలు స్వాధీనం

పెద్దకడబూరు , సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గరసు తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, జేసీబీలను పెద్దకడబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. గురువారం ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో కొండపై ఎటువంటి అనుమతులు లేకుండా గరసును తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకోని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని కులాలకు సామాజిక న్యాయం, ఆర్థిక స్వావలంబన చేయటం ఒక్క కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందని, ఇందులో భాగంగానే అన్ని కులాలకు కార్పోరేషన్లు ఏర్పాటు చేసిందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్‌లో ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంలో కూడా గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది పేదవారు ఉన్నారని, అలాగే పేద రైతులు ఉన్నారన్నారు. వారిని ఆదుకునేందుకు రెడ్డి కార్పోరేషన్ ఏర్పాటు చేసి అధిక నిధులు కేటాయించాలని కోరారు. అలాగే యోగి వేమన జయంతిని అధికారికంగా నిర్వహించటంతో పాటు సెలవుదినంగా ప్రకటించాలని, ఓర్వకల్లు ఏయిర్ పోర్టుకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

పోషక విలువలపై అవగాహన



గర్భిణులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ వీణ, సీడీఎస్, సీడీపీవో సఫరున్నిసా బేగం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని షాదిఖానా, ఎన్‌టీఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలో భాగంగా సీడీఎస్ సీడీపీఓ సఫరున్నిసా బేగం, డాక్టర్ వీణ గర్భిణులకు పోషక విలువల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడిలు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

నందవరం సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ.. స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రఘురామిరెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రమైన నందవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విరుపాక్ష శెట్టి, మల్లికార్జున, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీగా కాకర్ల సురేశ్ చౌదరి



ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న సురేశ్ చౌదరి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మిగనూరు మండలం ఆర్గనైజింగ్ సెక్రటరీగా మండల పరిధిలోని బోడబండ గ్రామానికి చెందిన కాకర్ల సురేశ్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎంతో నమ్మకంతో ఆర్గనైజింగ్ సెక్రటరీ పదవి అప్పగించడంతో ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక అభినందలు తెలిపారు. ప్రభుత్వం అందజేసే ప్రతి పథకాన్ని ప్రజలకు అందజేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

అధికారుల విచారణ

మంత్రాలయం,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : మంత్రాలయంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో యూకేజీ చదువుతున్న మహబూబ్‌బాషా, రియానాల కొడుకు అయాన్‌ను పాఠశాల బస్సు డ్రైవర్ నరేష్ విద్యార్థి చెంపపై కొట్టడంతో డీఈవో శామ్యూల్‌పాల్, తాహసీల్దారు రమాదేవి, ఎంఈఓలు ఫైనుద్దీన్, రాగన్న విచారణ చేశారు. గురువారం విద్యార్థి తల్లిదండ్రులు తన కొడుకును కొట్టిన డ్రైవర్ నరేష్‌పై ఫిర్యాదు చేసేందుకు విముఖత వ్యక్తం చేశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాల యాజమాన్యం ఇలాంటివి జరగకుండా చూడాలని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నివేదికను కలెక్టర్‌కు పంపుతామన్నారు. అధికారుల విచారణ అనంతరం విద్యార్థి సంఘాలైన ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు పాఠశాలను సీజ్‌చేయాలని, పాఠశాలలోని ఫర్నీచర్, పూలకుండీలను పగులగొట్టారు. పాఠశాల రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయాలని డీఈఓను డిమాండ్ చేశారు. ఆర్ఐ జనార్దన్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, థామస్, రాజేష్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ స్వీపర్‌కు విషపురుగు కాటు

గోనెగండ్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):గోనెగండ్ల మండల పరిధిలోని మోడల్‌స్కూల్‌లో ఫిజిక్స్‌ల్యాబ్‌ను శుభ్రం చేస్తుండగా స్వీపర్‌గా పనిచేస్తున్న క్రిష్ణవేణమ్మకు బుధవారం ఉదయం గుర్తు తెలియని విషపురుగుకాలుకు కాటు వేసింది. అయితే పాఠశాల సిబ్బంది ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా జాగ్రత్త పడ్డారు. దీంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం మేరకు క్రిష్ణవేణమ్మ బుధవారం ఉదయం పాఠశాలలోని గదులను శుభ్రం చేసే కార్యక్రమంలో భాగంగా ఫిజిక్స్ ల్యాబ్ కు వెళ్లి శుభ్రం చేస్తుండగా గుర్తు తెలియని విషపురుగు కాటు వేసింది. కాలికి రెండు కాట్లు కూడా ఉన్నాయి. కాట్లు పాముకాటు మాదిరే ఉన్నాయన్నారు. సంఘటనలను చూసి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే బీవీ కృషితోనే రైతులకు సాగునీరు

నందవరం,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కృషితోనే రైతులకు సాగునీరు అందుతుందని, చిన్నకొత్తిలి డిస్ట్రిబ్యూటరీ చెర్మన్ గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు రైస్‌మిల్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని హాలహర్వి గ్రామంలోని దేశాయి చెరువు దగ్గర ఎల్లెల్సీ ఇంజనీరు మనికంఠతో కలసి చెరువును పరిశీలించారు. వీరితో పాటు వర్కుఇన్స్‌పెక్టర్, లస్కర్ షేక్షావలి, టీడీపీ నాయకులు నాగరాజు, ఎర్రన్న, ప్రభుదాసు. ఎర్రంనాయుడు, మణి ఉన్నారు